www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



పచ్చని పల్నాడు.. నా కల

- పల్నాడును సిరుల మాగాణిగా మారుస్తా
- వరికపూడిశెల పూర్తి చేసి 1.2 లక్షల ఎకరాలకు సాగునీరు
- వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ తాగునీరు
- ప్రాజెక్టు పనులు మధ్యలో ఆగకుండా ఉండాలంటే నేను గెలిచి తీరాలి
- పల్నాడు ప్రజల కళ్లలో ఆనందం చూడటం కోసం శ్రమిస్తా
- నా గెలుపు పల్నాడు ప్రజల గెలుపు

4లో..

- నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు

ఆదివారం | 5-5-2024

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

తీరం.. పేకాట కేంద్రం

- పర్యాటకంగా అభివృద్ధిని మరిచారు
- మడ అడవులను చెరపట్టేసిన ఘనులు
- కాల్వల్లో పూడిక తియ్యలేని దద్దమ్మ ప్రభుత్వం
- రేపల్లె వారాహి విజయభేరి యాత్రలో పవన్‌కల్యాణ్



రేపల్లె సభకు హాజరైన జన సందోహం





• రేపల్లెలో పవన్ ర్యాలీ

కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ..

రేపల్లె, మే 4: సుదూర సముద్ర తీరం.. ఆహ్లాదకరమైన వాతావరణం.. పర్యాటకంగా అభివృద్ధి చెయాల్సిన ప్రాంతం. కానీ వైసీపీ నాయకులు తీరాన్ని పేకాట క్లబ్‌లకు కేరాఫ్‌గా మార్చారు. పర్యాటకంగా అభివృద్ధి చేయడాన్ని జగన్ ప్రభుత్వం విస్మరించగా స్థానిక నాయకులు పేకాటకు కేంద్రంగా చేసేశారు. పేకాటను ఆదాయ వనరుగా మార్చుకున్నారు.. అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆరోపించారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా పవన్‌కల్యాణ్ శనివారం రేపల్లెలో పర్యటించారు. కూటమి లోక్ సభ, అసెంబ్లీ అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, అనగాని సత్యప్రసాద్‌ల తరఫున ప్రచారం చేశారు. తొలుత శనివారం మధ్యాహ్నం హెలికాప్టర్‌లో వచ్చిన పవన్ కల్యాణ్‌కు టీడీపీ, జనసేన నేతలు ఘనంగా స్వాగతం పలికారు. వారాహి బస్సులోనే భోజనం చేసిన అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వరకు జరిగిన రోడ్ షోలో పాల్గొన్నారు. వేల సంఖ్యలో జనసైనికులు, టీడీపీ, బీజేపీ శ్రేణులు వెంట రాగా మహిళలు హారతుల మధ్య పవన్ రోడ్‌షో జరిగింది. పవన్ పర్యటనతో రేపల్లె వీధులు జనసంద్రాన్ని తలపించాయి. మార్గమధ్యలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని 13వవార్డు ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా జీతాలు లేవని అంగన్ వాడీలు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా ప్రజా ప్రభుత్వంలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ లో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఐదేళ్ల నుంచి సాగునీటి కాల్వల్లో కనీసం పూడిక తీయలేని దద్దమ్మ ప్రభుత్వం గా వైసీపీ నిలిచిందన్నారు. దీంతో లక్షల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం మారినా పాలకులకు చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రేపల్లె పరిధిలోనే లక్షన్నర ఎకరాలు సాగుకు నోచుకోకుండా పోయాయన్నారు. నిజాంపట్నం పోర్టు అభివృద్ధి చేస్తే ఎంతోమందికి ఉపాధి దొరికేదని కానీ ప్రభుత్వం తాత్సారం చేసిందన్నారు. సూర్యలంక తీరంలో 95 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి రక్షణగా ఉన్న మడ అడవులపై కన్నేసిన వైసీపీ నేతలు వాటిని కూడా చెరపట్టేశారన్నారు. జగన్‌కు చెట్లు అంటే గిట్టదని పచ్చని చెట్లు నరికేయడం వీరికి అలవాటేనన్నారు. ఇసుక, మట్టిని దోచేయడంలో ఇక్కడి ప్రజాప్రతినిధులు అన్ని హద్దులను చెరిపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆదర్శ నాయకుడితోనే బాగు : అంబటి

ఈ రాష్ట్రాన్ని బాగు చెయ్యాలంటే ఆదర్శనాయకుడు అవసరమని క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. క్రికెట్‌లో ఎమ్మెస్ ధోనీకి ఉన్నంత క్రేజ్ ఏపీలో పవన్‌కల్యాణ్ ఉందన్నారు. మంది బలాన్ని పవన్‌కు రాజకీయబలంగా మార్చాలన్నారు. రియల్ హీరో పవన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.

సైకోను తరిమికొట్టాలి : అనగాని సత్యప్రసాద్

రాష్ట్రంలో సైకో పాలనను తరిమి కొట్టాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటే అధికారం ఇస్తే ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రజలను రక్షించేందుకు, భావితరాల భవిష్యత్ కోసం కూటమి ఏర్పడిందన్నారు. మరోమారు జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నిసర్వనాశనం చేస్తారనే ఉద్దేశంతో ఓట్లు చీలకుండా ఎన్డీయేని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పవన్‌కల్యాణ్ ముందుకు వచ్చారన్నారు. రైతులకు సాగునీరు అందించకపోగా గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించిన దాఖలాలు లేవన్నారు. ఇసుక, మట్టి, భూదందాలు, నాసిరకం మద్యంతో ప్రజలను దోచుకున్నారన్నారు. రాష్ట్రానికి గంజాయి హబ్‌గా మార్చేసిన ఘనత జగన్‌దేనన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు రూ.100 ఇచ్చి రూ.1000 దోచుకుతింటున్నారన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి : తెన్నేటి కృష్ణప్రసాద్

రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీ కూటమితోనే సాధ్యమని టీడీపీ బాపట్ల లోక్‌సభ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. అభివృద్ధే ఊసే లేదన్నారు.పవన్ త్యాగం వృథా పోదని తెలిపారు. ప్రజలు కూటమిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

గులకరాయికే పెద్ద డ్రామా.. మరి బాలుడ్ని తగలపెట్టారుగా..

చిన్న గులకరాయి పడితేనే పెద్ద డ్రామా చేశావే.. అలాంటిది ముక్కుపచ్చలారని బాలుడిపై పెట్రోలు పోసి అమానుషంగా తగలబెట్టారే.. అది తలచుకుంటేనే బాధేస్తోంది. వైసీపీ మూకల నుంచి అక్కను కాపాడుకునేందుకు యత్నించిన రేపల్లె ప్రాంతానికి చెందిన బాలుడు అమర్నాథ్ గౌడ్ బలయ్యాడు. నిండునూరేళ్లు బతకాల్సిన బిడ్డను చంపేశారు. దీనికి కారణం ఎవరు జగన్. లా అండ్ ఆర్డర్ వైఫల్యమే కదా. రేపల్లె రైల్వే స్టేషన్‌లో ఓ నిరుపేద మహిళపై అఘాయిత్యం జరిగినప్పుడు ఒకట్రెండు రేప్‌లు జరుగుతాయని హోంమంత్రి వనిత బాధ్యత లేకుండా మాట్లాడారు. అప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే అమర్నాథ్‌గౌడ్ హత్య జరిగి ఉండేదా. బాలుడి ప్రాణానికి ఎంపీ రూ.10 లక్షలు ఖరీదు కట్టబోగా తల్లిదండ్రులు ఛీకొట్టారు. పోలీసులను తొత్తులుగా మార్చుకుని ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడం వల్లే నేరస్తులకు భయం లేకుండా పోయింది.



జనంతోనే.. నేను

ఆంధ్రజ్యోతితో చిలకలూరిపేట అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

- రైతుల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం
- ఆదర్శ నియోజకవర్గంగా నిలపాలన్నదే నా ఆశ
- అధికార పార్టీ దురాఘతాలపై వెన్ను చూపని పోరాటం

నేను ప్రజల మనిషిని

నేను సామాన్య కుటుంబం నుంచి ఈ స్థాయికి వచ్చాను. సామాన్యుల బాధలన్నీ స్వయంగా అనుభవించినవాడిని. భేషజాలు లేవు. సమస్యలు సంపూర్ణంగా పరిష్కరించినప్పుడే నాకు పూర్తి సంతృప్తి. ఈ దృష్టితోనే నా రాజకీయ ప్రస్థానం నడిచింది. భవిష్యత్తులో కూడా ఇదే శైలిలో నడుస్తుంది. సమస్యలు లేని నియోజకవర్గంగా చిలకలూరిపేట ను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలన్నదే నా ఆశ, శ్వాస.

చిలకలూరిపేట, మే 4: జనంలో ఉంటాను. జనమే నాబలం. వారి సమస్యల పరిష్కారం కోసమే నా ప్రతి అడుగు. రైతు కుటుంబంలో పుట్టా, అరకదున్నా, కుప్ప నూర్చా, రైతు బాధలు తెలుసు. అందుకే వారి సంక్షేమమే నా ప్రథమ కర్తవ్యం. నియోజకవర్గంలో తాగు, సాగునీరు, రోడ్ల వంటి అంశాలకు పెద్దపీట వేసి దాదాపుగా 80 శాతం కార్యక్రమాలను అమలు చేశాను. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలను మమేకం చేసి ఎన్నికల్లో ప్రచార పర్వాన్ని నిర్వహిస్తున్నాను. అధికార పార్టీ దురాగతాలను ఎదిరించి వెన్ను చూపకుండా పోరాటం చేస్తున్నా.. అని చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం మంత్రిగా ప్రజల ఆదరాభిమానాలను పుల్లారావు చూరగొన్నారు. భేషజాలు లేకుండా ప్రతికార్యకర్తనూ ఆప్యాయంగా పలకరిస్తూ, సామాన్యులు సైతం నేరుగా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఇచ్చిన ప్రజానాయకుడి గుర్తింపు పొందారు. ప్రచారంలో దూసు కెళ్తోన్న ప్రత్తిపాటి పుల్లారావు ఆంధ్రజ్యోతితో పలు అంశాలపై మాట్లాడారు. ఆయన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

కామధేనువు వంటి మేనిఫెస్టో

చంద్రబాబు అపూర్వ సృష్టి సూపర్ సిక్స్. అద్భుత పథకాలకు ప్రజల్లో వచ్చిన స్పందన అపూర్వం. ఉమ్మడి మేనిఫెస్టో నిజంగా కామధేనువు, కల్పవృక్షం వంటిది. వీటి అమలుతో రాష్ట్రం సుభిక్షమే. మన రాష్ట్రాన్ని దేశంలో అగ్రభాగాన నిలపడానికి ఈ మేనిఫెస్టో అమలు ఒక అద్భుత సోపానం.

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధం

వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసింది. దుర్మార్గ పాలనపై ప్రజలు భగ్గున మండిపడుతున్నారు. ప్రజావ్యతిరేకత ఉప్పెనలా ముంచెత్తనున్నది. స్థానిక పాలకులతో పాటు జగన్మోహన్ రెడ్డి వరకు గుణపాఠం చెప్పడానికి ఎన్నికల తేదీ కోసం ఓటర్లు ఎదురు చూస్తున్నారు. ప్రచార సమయంలో ప్రజాగ్రహం ప్రతిచోటా కనిపిస్తున్నది. ఈ చెత్త ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నారు. అసమర్థ పాలన, మంత్రి అరాచక పోకడలతో విసిగి వేశారిన ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పడానికి ఎదురుచూస్తున్నారు.

విషపు మొక్క

సైబరాబాద్‌లో చంద్రబాబు నాటిన మొక్కను అని గొప్పలు చెప్పిన నాయకురాలు ఎదుటి పార్టీలోకి ఫిరాయించి విషపు మొక్కగా మారింది. అవినీతి ఎన్నిరకాలుగా చేయవచ్చో చూపి చరిత్ర సృష్టించింది. తీవ్ర ప్రజాగ్రహానికి గురై ఆరు నెలలకు ముందే వలసపోయింది. ప్రజల ఆస్తులకు కూడా భద్రత లేకుండా పోయింది.

ప్రజాక్షేత్రం.. తీపి గుర్తులు

మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యే ఎన్నికయ్యా. ఒక పర్యాయం కేవలం 212 స్వల్ప ఓట్లతో పరాజయం చెందా. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేళ్లు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేశా. వ్యవసాయశాఖ మంత్రిగా రైతు రుణమాఫీకి కృషి చేశా. చంద్రబాబు ఆదేశాల మేరకు రాజధాని అమరావతి భూసమీకరణకు శ్రమించా. దేశ చరిత్రలోనే తొలిసారి వ్యవసాయ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టా. గోదావరి జిల్లాల పార్టీ కోఆర్డినేటర్‌గా శక్తివంచన లేకుండా కృషి చేసి, పార్టీ పటిష్టతకు కృషి చేశా. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చిలకలూరిపేటలో జాతీయ రహదారి దిగ్బంధనం చారిత్రాత్మక ఘటనగా గుర్తింపు పొందింది. నా ఎదుగుదలను తట్టుకోలేక రాజకీయాలకు సంబంధంలేని నా కుమారుడిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం కలచివేసింది. అయినా న్యాయ స్థానాలపై నమ్మకంతో ముందడుగు వేశాను. కేసులకు, దౌర్జన్యాలకు భయపడేదిలేదని ఆచరణలో నిరూపించా.

సమస్యలపై స్పష్టత

కొండవీడును జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా. నియోజకవర్గంలోని అన్ని ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి పొలాలకు సాగునీటి వసతి కల్పిస్తా. అమృత్ ద్వారా గతంలో మంజూరైన జలజీవన్ మిషన్ ద్వారా రూ.33 కోట్లతో నియోజకవర్గంలోని 44 గ్రామాలు, పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తా. ఓడరేవు నకరికల్లు రోడ్డు నిర్మాణం, చెన్నై కోల్‌కత్తా జాతీయ రహదారి బైపాస్ పనుల పూర్తి, టిడ్కో పనుల పూర్తి, అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు, శాశ్వత గృహ నిర్మాణం చేస్తాను. చిలకలూరిపేటలో 50కి పైగా ఉన్న వివిధ కులాల వారికి కమ్యూనిటీ భవనాలు, షాదీ ఖానాల నిర్మాణం. పట్టణంలో 300 కి.మీ సిమెంట్ రోడ్ల నిర్మాణం, ఆటోనగర్, సైన్సెస్ పార్కుల నిర్మాణం చేస్తాను. పట్టణంలో టౌన్ హాల్, స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేస్తాను. ప్రతి మండలంలో జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తా. గతంలో రు.18 కోట్లు మంజూరైన ముస్లిం బాలికల హాస్టల్, కేంద్రీయ విద్యా భవన సముదాయ నిర్మాణాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తాను.



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై ప్రత్తిపాటి పుల్లారావు, జంగా కృష్ణమూర్తి , తదితరులు

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తాం

- యాదవుల ఆత్మీయ సమావేశంలో లావు
- వైసీపీలో బడుగులకు అన్యాయం : ఎమ్మెల్సీ జంగా

చిలకలూరిపేట, మే 4: ఎస్సీ, ఎస్టీల తరహాలోనే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని నరసరావుపేట లోక్‌సభ కూటమి అభ్యర్థి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. స్థానిక సింగు కల్యాణ మండపంలో శనివారం జరిగిన యాదవుల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీసీల కోసం టీడీపీ ప్రత్యేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు అనుమతులు, ఆస్పత్రితో పాటు వైద్య కళాశాల, రూ.3 వేల కోట్లతో జాతీయ రహదారులు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తాను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ, బీసీ సీనియర్ నాయకుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేసే పరిస్థితి అధికార వైసీపీలో లేదన్నారు. వైసీపీ బీసీలకు పదవులు మాత్రమే ఇచ్చిందని, వారికి అధికారాలు, గౌరవం ఇవ్వలేదన్నారు. బీసీలకు పదవుల కంటే ఆత్మగౌరవం ముఖ్యమని కానీ, ఆ పరిస్థితి వైసీపీలో లేదన్నారు. అక్కడ అవమానాలు పడలేక, గౌరవం లభించకే టీడీపీలో చేరినట్లు తెలిపారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. చిలకలూరిపేట కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ బీసీలకు, బలహీనవర్గాలకు టీడీపీ వెన్నెముక అని తెలిపారు. గౌరవం లేనిచోట ఉండకూడదని ఏవిధంగా అయితే శ్రీకృష్ణదేవరాయలు బయటకు వచ్చారో అలానే జంగా కూడా బయటకు వచ్చారన్నారు. గౌరవం లేకపోయినా, దోపిడీ చేసే జగన్‌రెడ్డితో ఉండే విడదల రజినీ లాంటి వాళ్లు స్థానిక ప్రజలు ఆదరించరని గుంటూరు పారిపోయారన్నారు.

పండుటాకులపై పగ

- జగన్ ఓట్లాటలో పావులైన వృద్ధులు
- దురాలోచనతోనే బ్యాంకుల్లో పింఛన్ జమ
- ఎండల్లో బ్యాంకుల చుట్టూ తిరిగి అల్లాడుతున్న వృద్ధులు
- జీరో బ్యాలెన్స్‌తో ఎడాపెడా కోతలు.. చేతికొస్తోంది సగమే
- ఖాతాల్లో జమపై సమాచారం చెప్పని సచివాలయ సిబ్బంది
- బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారని వృద్ధుల ఆవేదన

గుంటూరు సిటీ, వినుకొండటౌన్, మే 4: మండే ఎండలు.. సాధారణ వ్యక్తులే జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ప్రభుత్వమే ప్రజలకు అధికారికంగా సూచిస్తోంది. అయితే సామాజిక పింఛన్లు అందుకునే వృద్ధుల విషయంలో దీనిని మరిచిపోయింది. జగన్ కుటిల రాజకీయ స్వార్థం కోసం, మే ఎండల్లో మలమల మాడుతూ వృద్ధులు పెన్షన్ల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చెయ్యాల్సి వస్తోంది. జగన్ ఓట్లాటలో వృద్ధులు పావులుగా మారి అల్లాడిపోతున్నారు. ఎప్పటిలాగానే ఇంటింటికి సిబ్బందిని పంపి పింఛన్లు ఇప్పించ వచ్చు. అందుకు సచివాలయ ఉద్యోగులు సరిపోకపోతే ఇతర సిబ్బందిని వాడవచ్చు. ఆ రీతిగా వృద్ధులకు జగన్ మేలు చేస్తానంటే చంద్రబాబు, పవన్ అడ్డుపడేది కూడా ఏమీ ఉండదు. కానీ ఈ విషయాన్ని ఎన్నికల వేళ రాజకీయం చేయాలనే దురాలోచనతో ఉన్న జగన్‌కు, ఆయన ప్రభుత్వంలోని అధికారులు పింఛన్లను బ్యాంకుల్లో జమ డ్రామాకు తెర లేపారని లబ్ధిదారులతో పాటు వివిధ వర్గాల ప్రజలు విమర్శిస్తున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సామాజిక పింఛన్లు అందుకునే వారు 5,83387 మంది ఉండగా వీరిలో అత్యధికులు వృద్ధులు, దివ్యాంగులే. వారిలో కూడా అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారున్నారు. పింఛన్ బ్యాంకుల్లో జమతో గ్రామీణులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఎవరెవరికి బ్యాంకులో పింఛన్ జమ చేస్తున్నారో ఆ విషయం తెలియజేయాలని కలెక్టర్లు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో అది జరగ లేదు. రెండు రోజులు గడిచినా ఇంటి వద్దకు వచ్చి పింఛన్ పంపిణీకి సచివాలయ సిబ్బంది రాకపోవడంతో పలువురు శని వారం సచివాలయాల బాట పట్టారు. సచివాలయ సిబ్బంది వృద్ధులన్న కనికరం కూడా చూపలేదన్న విమర్శలు వచ్చాయి. ఎండలోనే పెన్షన్ కోసం వృద్ధులు పడిగాపులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్త చేస్తున్నారు.

బ్యాంకుల వద్ద పడిగాపులు

లబ్ధిదారులు పెన్షన్లు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు బ్యాంకులకు వేలాదిమంది రావడంతో రద్దీ నెలకొంది. రోజంతా నిరీక్షించాల్సి వచ్చింది. గంటల కొద్దీ క్యూలో నిలబడి తర్వాత కానీ కొందరికి ఖాతాల్లో పింఛన్లు జమ కాలేదన్న విషయం తెలిసింది. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో వృద్ధులకు చుక్కలు చూపించారు. శనివారం వరకు కూడా చాలామందికి పెన్షన్లు ఎక్కడ జమయ్యాయో తెలియరాలేదు. 99 శాతం పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారే కానీ వాస్తవంగా 40 శాతం మందికి కూడా పెన్షన్ లబ్ధిదారుల చేతికి అందిన దాఖలాలు లేవు. ఇక నగదు జమ చేసినా చాలామంది ఖాతాల నుంచి నిర్వహణ చార్జీల పేరుతో బ్యాంకర్లు నగదు మినహాయించుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.1500 వరకు మినహాయించడంతో లబ్ధిదారులకు సగం పింఛనే చేతికి అందింది. మండల, పట్టణ ప్రాంతాల్లోని బ్యాంకుల వద్దకు గ్రామాల నుంచి ఎన్నో వ్యయప్రాసలకు ఓర్చి లబ్ధిదారులు రావాల్సి వచ్చింది. ఎండలోనే రాకపోకలు, బ్యాంకుల వద్ద పడిగాపులతో వృద్ధులు నీరసించి అస్వస్థతకు గురైన వృద్ధులు ఎందరో ఉన్నారు.



పెన్షన్ కోసం బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న దృశ్యం

మూడు బ్యాంకులు తిరిగాను

- మర్రి లక్ష్మమ్మ, నలబోతవారిపాలెం, కర్లపాలెం మండలం



నాకు ఏ బ్యాంకులో పింఛను పడిందో ఎవరూ చెప్పలేదు. మూడు బ్యాంకులకు తిరిగాను. ఎక్కడికి వెళ్లినా సరైన సమాచారం ఇవ్వలేదు. నాకు చదువు రాదు. సహాయం కోసం ఓ బాబుని తీసుకుని వచ్చా. అయినా ప్రయోజనం లేదు. ప్రభుత్వం ఇంటికి తీసుకు వచ్చి పింఛన్ అందజేస్తే బాగుండేది.

ఖాతాలో నగదు జమకాలేదు

- బొమ్మిరెడ్డి కృష్ణ, దాచేపల్లి



బ్యాంకు ఖాతాలో పింఛన్ నగదు జమకాలేదు. ఖాతాలో వేసినట్లు అధికారులు చెప్పారు. తీరా బ్యాంకుకు వెళ్లాక నెంబర్ లింక్ అవ్వలేదని చెప్పారు. సచివాలయ సిబ్బంది ఇళ్లకు తెచ్చి ఇస్తే ఈ బాధలు ఉండవు కాదు. ఎందుకు ఇంత ఇబ్బంది పెడుతున్నారు.

నరకయాతన పడుతున్నా

- ఏల్చూరి సుబ్బులు, గుంటూరు.



పెన్షన్ కోసం నరకయాతన పడుతున్నా. బ్యాంకుకి రావాలంటే ఆటోకి రూ.100 ఇవ్వాలి. ఒక రోజులో పింఛన్ ఇవ్వకుంటే మళ్లీ రావాలి. అప్పుడు అధిక మొత్తంలో చార్జీలకే ఖర్చు అవుతుంది. పొద్దున వచ్చా. మధ్యాహ్నం అయినా పెన్షన్ ఇవ్వలేదు. చాలా ఇబ్బంది పడుతున్నా.

తప్పదు.. తీసుకోవాల్సిందే..!

- పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు వైసీపీ నేతల హుకుం
- ఓటుకు రూ.5వేల చొప్పున అందజేత ? ● వద్దన్నా బెదిరించి ఇస్తున్న వైనం

మాచర్ల టౌన్, మే 4 : మాచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగనుంది. మాచర్ల నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి సుమారు 2146 మంది ఓటర్లు ఎన్నికల విధులకు వెళ్తున్నారు. దీంతో అధికార వైసీపీ నేతలు ముందుగానే పోస్టల్ ఓటింగ్ వినియోగించుకునే వారి వివరాలను సేకరించారు. అనంతరం తమ మార్కు బెదిరింపు చర్యలకు దిగారు. కొంత మంది నేతలు ఇళ్లకెళ్లి నోట్ల కవర్లు ఇచ్చి ఓట్లు వేయాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు. డబ్బులు తీసుకోవడానికి కొందరు నిరాకరించగా, అధికార పార్టీ నేతల నుంచి బెదిరింపులు రావడంతో వారు తీసుకోక తప్పలేదు. ఈ విధంగా ఓటుకు రూ.5 వేల చొప్పున అందజేసి సుమారు 1600 పోస్టల్ ఓట్లు కొనుగోలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

నేడు 'నీట్' పరీక్ష

- ఏర్పాట్లు పూర్తిచేసిన ఎన్టీఏ ● నిమిషం అలస్యమైనా నో ఎంట్రీ

గుంటూరు(విద్య),మే 4: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయస్థాయిలో నిర్వహించే నేడు నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్షకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గుంటూరు నగరంలో ఏడు కేంద్రాలు, పొన్నూరులో ఒక కేంద్రంలో ఏర్పాట్లను ఎన్టీఏ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. వేసవినేపథ్యంలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, ప్రథమ చికిత్సకు ఏర్పాట్లుచేయాలని కేంద్రాల ఇన్‌చార్జీలకు సూచించారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 వరకే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిర్దేశించిన సమయం తర్వాత ఒక్క నిమిషం అలస్యమైనా అనుమతించమని స్పష్టం చేశారు. నీట్ పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 4,089 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

నీట్ కేంద్రాలివే... గుంటూరు నగరంలోని జేకేసీ కళాశాల, చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల, జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్, మోతడకలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, బ్రాడీపేటలోని బీహెచ్ డిగ్రీ కళాశాల, శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్, పొన్నూరులోని నాట్కో స్కూల్లో పరీక్షా కేంద్రాలను ఎన్‌టీఏ ఏర్పాటు చేసింది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు హాల్ టికెట్, రెండు పెన్నులు, పారదర్శకత ఉన్న వాటర్ బాటిల్ మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. సాధారణ వస్త్రాలను ధరించి, ఎటువంటి ఆభరణాలు లేకుండా హాజరుకావాలి. చేతికి వాచీ, ఉంగరాలు, చెవి దిద్దులు, ముక్కుపుడక సహా ఎటువంటి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ సామగ్రి వెంట తీసుకురాకూడదని ఎన్టీఏ నిబంధనల్లో పేర్కొన్నారు.

వైసీపీ ప్రచారంలో ఆర్టీసీ కండక్టర్..



ఎమ్మెల్యే కాసుతో రాంబాబు

గుంటూరు, మే4: తెలంగాణ రాష్ట్రం, మిర్యాలగూడ డిపో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్న బెల్లంకొండ రాంబాబు గురజాల నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తరఫున ప్రచారంలో పాల్గొంటున్నాడు. అక్కడ డ్యూటీ లేని రోజు ఇక్కడకు వచ్చి కాసు మహేష్‌రెడ్డితో పాటు ఎన్నికల ప్రచారంలో ఉంటున్నాడు. ఈ విషయంపై విచారణ చేపట్టి ఆయనపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



నిలిచిపోయిన ప్రాజెక్టును చూపిస్తున్న పెమ్మసాని, నజీర్, రామాంజనేయులు, మాధవి

వైసీపీతోనే గుంటూరుకు తాగునీటి శాపం

- రూ.122 కోట్ల తాగునీటి ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు
- డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(కార్పొరేషన్), మే 4: గుంటూరు నగరానికి తాగునీరు లేకుండా చేసిన ఘనత వైసీపీకి చెందుతుందని, ఆ పార్టీ నాయకులు గడిచిన ఐదేళ్లుగా తాగునీటి గురించి పట్టించుకోలేదని గుంటూరు పార్లమెంట్ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం గోరంట్ల కొండపైన నిర్మిస్తున్న తాగునీటి పథకం పనులను టీడీపీ అభ్యర్థులు బీ.రామాంజనేయులు, గల్లా మాధవి, నజీర్ అహ్మద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కొండపైనే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం గుంటూరు గోరంట్ల కొండపైన సమగ్ర తాగునీటి పథకం నిర్మించేందుకు రూ.122 కోట్లతో పనులు చేపట్టిందని అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ తాగునీటి పథకం గురించి పట్టించుకోలేదు. దీంతో గుంటూరు నగర ప్రజలకు తాగునీటి సమస్య అధికమైంది. సీఎం జగన్‌కు గుంటూరు నగర ప్రజల ఉసురు తగులుతుందని ఆయన ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గుంటూరు నగరంలోని అన్ని ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాలకు, విలీన గ్రామాలకు కూడా గ్రావిటీ ద్వారా తాగునీరు అందించవచ్చని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని, గుంటూరు నగర ప్రజలకు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని డాక్టర్ పెమ్మసాని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో కొందరు ట్యాంకర్ల యజమానులతో సిండికేట్ అయి ప్రజలకు అందాల్సిన తాగునీరు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

విలీన గ్రామాలను సర్వనాశనం చేశారు ...

2012లో నగరంలో కలిసిన విలీన గ్రామాలను వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బీ.రామాంజనేయులు తెలిపారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టిందన్నారు. 2019 తర్వాత ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించలేదని, దీంతో ఈ ప్రాజెక్టు వదిలేసి వెళ్ళిపోయారు అని అన్నారు. దీనిపై చర్చించేందుకు తాము సిద్ధమని సవాల్ విసిరారు.

తాగునీటి కొరతకు వైసీపీయే కారణం...

గుంటూరు నగరంలో తాగునీటి కొరత ఏర్పడటానికి ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వమేనని, నగరపాలక సంస్థ కౌన్సిల్ కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదని గుంటూరు తూర్పు టీడీపీ అభ్యర్థిని గల్లా మాధవి ఆరోపించారు. టీడీపీ హయంలో జరిగిన పనులే తప్ప, వైసీపీ అధికారంలోకి వచ్చాక గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. నగరంలో నెలకొన్న నీటి సమస్య ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వమేనని ఆమె ఆరోపించారు.

వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు..

వైసీపీ ప్రభుత్వం నగరంలో ప్రజలకు కావలసినటువంటి కనీస మౌలిక సదుపాయాలను పట్టించుకోలేదని తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నసీర్ అహ్మద్ ఆరోపించారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో అనేక రిజర్వాయర్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. అనేక పర్యాయాలు మున్సిపల్ అధికారులకు చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఏచర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగరపాలక సంస్థను అవినీతికి కేంద్రంగా మార్చారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా

- టీడీపీలో చేరుతున్నట్లు షేక్ మస్తాన్ ప్రకటన

క్రోసూరు, మే4: మండల కేంద్రం క్రోసూరులో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఇంత కాలం వైసీపీకి గట్టి నాయకుడిగా ఉన్న రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్ శనివారం సాయంత్రం తన అనుచరులతో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం తన అనుచర వర్గంతో పెదకూరపాడు టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ఆయన చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను నియోజక వర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అణగ దొక్కటమే ధ్యేయంగా పని చేశారన్నారు. అనేక సందర్భాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నియోజక వర్గంలో తీరని అన్యాయం చేశారన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి బీసీలకు రిజర్వ్ అయినా ఎమ్మెల్యే తన పలుకుబడితో ఓసీలకు అనుకూలంగా మార్చారన్నారు. నియోజక వర్గంలో ఎనిమిది సొసైటీ అధ్యక్ష పదవులు ఉండగా ఒక్కదానిలో కూడా బీసీలకు అవకాశం కల్పించలేదన్నారు. క్రోసూరు సర్పంచ్ పదవి బీసీ రిజర్వ్ కావటానికి అవకాశం ఉన్నప్పటికీ కేవలం తన మీద కక్షతో ఎస్టీకి మార్పించారని మస్తాన్ అన్నారు. ఇంతకాలం సహించామని, ఇక ముందు పార్టీలో ఇమడ లేకపోతున్నామని, అందుకే రాజీనామా చేసి బయటకు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు, ఎంపీగా లావు శ్రీ కృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నాయకత్వం ఎంతో అవసరమని భావించి టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్రోసూరు మోడల్ స్కూల్ ఛైర్మన్ రాచమంటి హనుమంతరావు, వైసీపీ మైనార్టీ నాయకులు షేక్ కరిముల్లా, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు. పెరికపాడు వైసీపీ నేత బయ్యవరపు మస్తాన్‌రావు, క్రోసూరుకు చెందిన వైసీపీ బీసీ నేతలు గంజన బోయిన శ్రీనివాసరావు కూడా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.



కొత్తపాలెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

ధైర్యంగా ఓటు హక్కుని వినియోగించుకోండి

- పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్
- సమస్యాత్మక గ్రామాల్లో పోలింగు బూత్‌ల పరిశీలన

మాచవరం, మే 4: ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో మీ ఓటును మీరు ధైర్యంగా వేసుకోవాలని పల్నాడుజిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఓటర్లకు సూచించారు. శనివారం మాచవరం మండలంలోని పిన్నెల్లి, తురకపాలెం, కొత్తపాలెం, మోర్జంపాడు, పిల్లుట్ల, మల్లవోలు, కొత్తగణేశునిపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం కొత్తపాలెం గ్రామంలో ఓటర్లతో ఆయన మాట్లాడారు. ఓటర్లు ఎవరైనా సరే ఎవరిని రెచ్చగొట్టే విధంగా వ్యవహరించవద్దని, అలా జరిగితే మాకు ఫిర్యాదు చేయాలే తప్ప మీరు చర్యలు తీసుకోకూడదని సూచించారు. ముఖ్యంగా పోలీస్ వారి సూచనలు, సలహాలు పాటిస్తూ సహకరించాలని తెలిపారు. ఊరు, జనం శాశ్వతమని, పార్టీల కోసం మీరు మీరు గొడవలు పడవద్దని సూచించారు. మీ గ్రామాల్లో ఎక్కడైనా రిగ్గింగ్ జరిగితే ఆ సమయంలో సీ విజిల్ యాప్‌కు సమాచారం చేరవేయాలని, వెంటనే సమీపంలో వున్న సిబ్బంది అక్కడకు చేరుకొని పరిస్థితిని గమనించి పోలింగ్ ఆపివేసి తిరిగి ప్రశాంతంగా వున్న సమయంలో పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక పోలీసు అధికారులకు కూడా సూచనలు, సలహాలు అందజేశారు.

గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా నాలుగు ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన నెంబరు. 07510 తిరుపతి - సికింద్రాబాద్, ఈ నెల 10న నెంబరు 07027 సికింద్రాబాద్ బరంపురం, ఈ నెల 11న నెంబరు. 07028 బరంపురం - సికింద్రాబాద్, 12న నెంబరు. 07059 సికింద్రాబాద్ -తిరుపతి రైళ్లు గుంటూరు మీదగా ప్రయాణిస్తాయని చెప్పారు.

10, 16, 22 తేదీల్లో నాలుగు రైళ్ల రద్దు

కాజీపేట - గూడురు మధ్యన మూడో రైలుమార్గం నిర్మాణ పనుల కారణంగా ఈ నెల 10, 16, 22 తేదీల్లో నెంబరు. 12705 గుంటూరు - సికింద్రాబాద్, నెంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు, నెంబరు. 17201 గుంటూరు - సికింద్రాబాద్, నెంబరు. 17202 సికింద్రాబాద్ -గుంటూరు రైళ్లను రద్దు చేసినట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

కూటమికి ప్రజల మద్దతు పెరుగుతోంది

- నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు



ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు

నరసరావుపేట టౌన్, మే 4 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ కూటమికి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతిస్తున్నారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు అన్నారు. శనివారం నరసరావు పేటలోని 6. 7, 8, 9 వార్డులలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ తదితరులతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రజలను, క్యాడర్‌ను వదిలిస్తే ఎలా ఉంటుందో ఇప్పుడు వైసీపీ నేతలకు అర్థం అయి ఉంటుందన్నారు. నరసరావుపేటలో అరవిందబాబు మంచి మెజారిటీతో గెలుస్తాడన్నారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ టీడీపీలోకి వచ్చిన వారిని భయపెట్టి మళ్లీ వారి పార్టీలోకి చేర్చుకోవడం మంచిదికాదన్నారు. రాబోయే ప్రభుత్వం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమేనని, పల్నాడులో ఏడు అసెంబ్లీ స్థానాలు గెలవబోతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా వార్డులలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు.

సీఎస్, డీజీపీని బదిలీ చేస్తేనే నిష్పాక్షిక ఎన్నికలు

- ప్రత్తిపాటి పుల్లారావు ● 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీ లో చేరిన బొప్పూడికి చెందిన కుటుంబాలు

చిలకలూరిపేట,మే4: సీఎస్, డీజీపీలను బదిలీచేయకుండా నిష్పాక్షిక ఎన్నికలు అసాధ్యమని మాజీ మంత్రి ప్రత్తిపాడు పుల్లారావు ఆందోళన వ్యక్తంచేశారు. చిలకలూరిపేట 17వ వార్డుకు చెందిన 20 ఎస్సీ కుటుంబాలు, బొప్పూడి నుంచి 20 కుటుంబాలు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారందరికీ ప్రత్తిపాటి టీడీపీ కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార వైసీపీ అరాచకాలు, ఆగడాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా తక్షణం మౌనం వీడి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఈఓ ఇంకా ప్రేక్షకపాత్రకే పరిమితమైతే తక్షణం కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని సీఎస్, డీజీపీలను తప్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ రాజకీయ హింసపై ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులను బాధ్యుల్ని చేయాలని ఆయన సూచించారు. పింఛన్ల పంపిణీలో వైసీపీ శవ రాజకీయాలు, ఎంతో మంది అవ్వాతాతల మరణాలకూ వైసీపీ కుట్రలే కారణమని ఆరోపించారు.

విధ్వంసకారుడు కాదు.. విజనరీ కావాలి

- 1600 రోజుకు చేరుకున్న నిరసనలు



వెంకటపాలెంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

తుళ్లూరు, మే4: మూడు రాజధానులని రాష్ట్ర ప్రజల జీవితాలను సీఎం జగన్‌రెడ్డి నాశనం చేశాడని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు శనివారం నాటికి 1600 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలు, రైతులు మాట్లాడారు. వైసీపీకి ఓటు వేస్తే ల్యాండు టైటిలింగ్ యాక్టు తీసుకొచ్చి జనం ఆస్తులపై హక్కు లేకుండా చేస్తారన్నారు. విజనరికి ఓటు వేసి విధ్వంసకారి జగన్‌రెడ్డి ఇంటికి పంపాలన్నారు. మూడు రాజధానులని ఐదేళ్ల నుంచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన పార్టీకి ఓటు వేస్తారా.. లేక విభజన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన టీడీపీకి ఓటు వేస్తారో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టించి సంక్షేమం, అభివృద్ధిని సమర్థంగా అమలు చేసే విజనరికి ఓటు వేయాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాల్లో రైతుల నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

హజ్ యాత్రికులకు
రేపు వ్యాక్సినేషన్

గుంటూరు (మెడికల్) మే 4: గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం ఈ నెల 6వ తేదీ ఉదయం 8 గంటల నుంచి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శుశ్రుతహాల్లో ప్రత్యేక వైద్య పరీక్షల, వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల నుంచి హజ్ యాత్రకు వెడుతున్న మొత్తం 240 మందికి ఈ వైద్య శిబిరంలో పోలియో, మెదడువాపు, ఇన్‌ఫ్లూయెంజా నివారణ వ్యాక్సిన్లు ఇస్తారని ఆమె తెలిపారు. యాత్రికులు ఈ శిబిరానికి హాజరై వ్యాక్సినేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	144, 153,164
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఎన్నికల ప్రచారంలో జూలకంటి బ్రహ్మారెడ్డి

పల్నాడు పౌరుషం చూపిద్దాం ..
రౌడీ రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలిద్దాం

● ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి, మే 4: పల్నాడు ప్రజలు పౌరుషం చూపించే సమయం ఆసన్నమైందని, ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి రౌడీ, దోపిడి, ఆటవిక రాజ్యాన్ని పారదోలాలని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్లపాడులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రశాంతంగా ఉన్న గుండ్లపాడులోతోట చంద్రయ్య హత్యతో గ్రామాల్లో అలజడి రేపారన్నారు. ప్రతి నాయకుడు కప్పం కట్టాలని హుకుం జారీ చేయడం వైసీపీ పరిపాలన ఎలాంటిదో అర్థం అవుతుందన్నారు. ప్రజలకు ఇచ్చే దానికంటే దోచేదే అధికంగా ఉందన్నారు. మరలా జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం అంటూ దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు ఒరగబెట్టేదేమీ లేదన్నారు. ఆనాడు రైతులకు ఉపయోగపడుతుందని జెర్రివాగు తీసుకొస్తే మరమ్మతులు నిర్వహించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. వరికపూడిశెల పూర్తి చేసి ఓట్లు అడుగుతామన్న ఎమ్మెల్యే పీఆర్కే ఏ మోహం పట్టుకొని ఓట్లు అడుతున్నారని, ఓట్లు అడిగేందుకు వచ్చినప్పుడు నిలదీయాలని అన్నారు. ఇసుక, గ్రానైట్, మైనింగ్‌పై శ్రద్ధ చూపారు గానీ ఒక్క ఎకరానికి కూడా నీళ్లిచ్చిన పాపాన పోలేదన్నారు. డబ్బుతో ఎన్నికల్లో గెలిచేందుకు చూస్తున్నారని, వీరికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి రాష్ట్ర కార్యదర్శి కళ్లెం రామాంజిరెడ్డి, పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రంనాయక్, ముత్తయ్య, కృష్ణమూర్తి, యల్లయ్య, రాజబోయిన మధు, గుండాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

150 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంలో 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన గృహంలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి శనివారం వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాణావత్ వెంకటేశ్వర్లునాయక్ ఆధ్వర్యాన ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారిలో కేతావత్ హనుమంతునాయక్, మల్లునాయక్, బాణావత్ చిన మంత్యానాయక్, రెడ్యానాయక్ ఉన్నారు.

ధర్మవరంలో శోభారాణి ప్రచారం

దుర్గి : మండల కేంద్రమైన ధర్మవరంలో శనివారం కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ 6 పథకాలను వివరించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, బ్రహ్మారెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. టీడీపీ మహిళలు, జనసేన వీర మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పులి హరి, తోట పద్మావతి, దిగుమర్తి సుబ్బారావు, చిరుమామిళ్ల మధుసూదనరావు, వీరభద్రయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత యల్లయ్య

మండల కేంద్రమైన దుర్గికి చెందిన వైసీపీ సీనియర్ నేత రేవల్ల యల్లయ్య, జక్కా మస్తాన్‌లు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నరసరావుపేటలోని కూటమి పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు బొజ్జా నరసింహారావు, కటకం రామారావు, నూరె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాన్న.. మీ వెన్నంటే ఉంటారు

రెంటచింతల : 'మా నాన్నను ఒక్కసారి అసెంబ్లీకి పంపించండి.. ఆయన ఎల్లప్పుడు మీ వెన్నంటే ఉంటారు' అని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి ఓటర్లకు హామీనిచ్చారు. శనివారం కృష్ణానది ఒడ్డునగల సత్రశాలలోని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ, టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో గొట్టం శ్రీనివాసరెడ్డి, ప్రభురాజ్‌యాదవ్, పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో యరపతినేని

ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తే
మీ ఇంట్లో ఫ్యాన్ ఆగిపోయినట్లే

● వైసీపీకి వీడ్కోలు పలకండి ... కూటమితోనే రాష్ట్రాభివృద్ధి
● కూటమి అభ్యర్థులు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని శ్రీనివాసరావు

గురజాలటౌన్, మే 4: ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తే మీ ఇంట్లో ఫ్యాన్ తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని కూటమి అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని గంగవరం, పులిపాడులలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. కూటమితోనే రాష్ట్రాభివృద్ధితోపాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాకుండా రాజారెడ్డి రాజ్యాంగాన్ని జగన్ అమలు చేస్తున్నారన్నారు. గురజాల నియోజకవర్గంలో కాసు ఐదేళ్లలో దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గురజాలను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. సూపర్ 6 పథకాలతో ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికలు

● తొలిసారిగా ఏర్పాటు
● 299 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలపై ప్రత్యేక పరిశీలన

మాచర్లటౌన్, మే 4 : మాచర్ల నియోజకవర్గంలో తొలిసారి వెబ్ కాస్టింగ్ ఏర్పాటు ద్వారా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నారు. 1952లో గురజాల మాచర్ల పేరుతో పల్నాడు నియోజకవర్గం ఏర్పాటైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అంటే 2024 మే 13 వరకు 16వ సారి ఎన్నికలు జరగబోతున్నాయి. ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి ఇతర ప్రాంతాల నుంచి పోలీసు బలగాలు వచ్చేవి. ఈ సారి ప్రత్యేకంగా కేంద్రబలగాలు అంటే సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాలను రంగంలోకి దించుతున్నారు. ఒక్కో గ్రామంలో 40మంది సిబ్బందిని స్థానిక పోలీసులతో పాటు విధులు నిర్వహించాల్సి ఉంది.

మాచర్ల నియోజకవర్గంలో 299 పోలింగ్ కేంద్రాలుండగా 151 దాకా సమస్యాత్మక కేంద్రాలున్నాయి. ఇప్పుడు 211 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. గతంలో జరిగిన ఏక పక్ష పోలింగ్,పోలీసు కాల్పులు, ఘర్షణలు, ఇతర పార్టీల నేతలపై దాడులు, దౌర్జన్యాలు చేసిన ఘటనలను పరిగణలోకి తీసుకుని మొత్తం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. వెబ్ కాస్టింగ్ అంటే రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల పరిశీలకులు తమ కార్యాలయాల నుంచే ఎక్కడో వున్న పోలింగ్ కేంద్రాల్లో జరిగే పోలింగ్ ప్రక్రియ మొత్తాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా పరిశీలించే అవకాశం వెబ్ కాస్టింగ్ ద్వారా లభిస్తుంది. ఆయా గ్రామాల్లో పెత్తందార్లు, బడా నేతలతో పాటు, దొంగ ఓట్లు వేసే వారికి ఎన్నికల సిబ్బంది సహకరిస్తే వాళ్లు ఇంటికి పోవాల్సి ఉంటుంది. పోలింగ్ రోజున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించడానికి వీల్లేదని ఓ ఐఏఎస్ ఆఫీసర్ స్పష్టం చేశారు.



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న భాష్యం ప్రవీణ్



బార్బర్ షాపులో క్రాఫ్ చేస్తూ ..



టీస్టాల్‌లో టీ ఇస్తూ ..

భాష్యం ప్రవీణ్ ముమ్మర ప్రచారం

● 'గుడ్‌మార్నిగ్ అచ్చంపేట' ప్రజలతో మమేకం
● ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు వేయాలని అభ్యర్థన
● చిరు వ్యాపారులు, వృత్తిదారులతో మాటామంతి..



చిన్నారిని ఎత్తుకొని ..

అచ్చంపేట, మే4: మండల కేంద్రమైన అచ్చంపేటలో శనివారం పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ 'మార్నింగ్ అచ్చంపేట' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామంలోని అన్ని సామాజిక తరగతుల ప్రజలను కలుస్తూ తనకు ఓట్లు వేయాలంటూ అభ్యర్థించారు. అనంతరం ప్రధాన వీధుల్లోని చిరువ్యాపారులు, దుకాణదారులను కలిసి వారి వ్యాపార సంబంధిత సమస్యలపై చర్చించారు. సూపర్ సిక్స్ కూటమి మేనిఫెస్టోలోని అంశాలతో కూడిన కరపత్రాలను అందజేసి వివరించి కూటమిని గెలిపించాలని కోరారు. బార్బర్ షాపులు, చెరుకురసం దుకాణం, టీస్టాల్స్‌వద్ద ఆగి ఆయా వృత్తులను చేపట్టి వారిలో ఒకరిలా కలిసి పోయారు. చిన్నారిని ఎత్తుకొని ఉత్సాహంగా ర్యాలీలో ముందుకు కదిలారు. తెలుగుదేశం ప్రభుత్వం చేతి వృత్తులకు, చిరు వ్యాపారు లకు చేయూత నిచ్చి వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుం దని తెలిపారు. బీసీలకు రక్షణ చట్టం, ఎస్సీలకు సబ్ ప్లాన్ నిధులు ఉమ్మడి ప్రభుత్వంలో ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ రద్దుచేసిన 27 పథకాలు పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, నల్లమేకల వెంకటేశ్వర్లు, రాయిడి సాంబశివుడు, ఎస్కే కాసుల, చల్లా అనూప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక .. మండలంలోని తాడువాయి గ్రామ వైసీపీ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ అనుమోలు వెంకటేశ్వరరావు, కస్తాల బాలస్వామి, మల్లెలచిన్ని, కండెల రవి, 16 కుటుంబాలకు చెందిన వారు భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు.

విజయం కోసం శ్రమించాలి

● కూటమి శ్రేణులకు భాష్యం ప్రవీణ్ పిలుపు

క్రోసూరు, మే 4: టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలందరూ ఎన్నికల రథసారధులుగా మారి కూటమి అభ్యర్థుల విజయం కోసం శక్తి వంచన లేకుండా శ్రమించాలని నియోజక వర్గ టీడీపీ కూటమి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం క్రోసూరు మండలంలోని అనంతవరం, గుడిపాడు, వీసపాడు, పెరికపాడు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలను సమావేశ పరిచి ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు.

వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు ..

బెల్లంకొండ: మండలంలోని వన్నాయపాలెం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మేకల సోమయ్య, శివయ్య, మాజీ డీలర్ సురేష్, పిన్నెబోయిన శ్రీనివాసరావు, చిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాష్యం ప్రవీణ్

అమరావతి: ధరణికోటగ్రామంలో ఎస్టీ సామాజికవర్గానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీ చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దండా శివనాగమల్లేశ్వరరావు, భాస్కరరావు, చేకూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలుగా పుణ్యక్షేత్రాలు ..



యరపతినేనికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు
● బుగ్గమల్లేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు
● ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ

మాచవరం, మే 4: మాచవరం మండలం మోర్జంపాడు శివారులోని అటవీ ప్రాంతంలో వేంచేసియున్న అతిపురాతనమైన బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ ఇప్పటికే బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గత టీడీపీ హయాంలో దేవాలయానికి వెళ్లే రోడ్డుమార్గం, విద్యుత్ సరఫరా, తాగు నీటి వసతులు, తదితర మౌలిక వసతులు ఏర్పాట్లు చేశామన్నారు. రానున్న రోజుల్లోనూ ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వ నిధులతో పాటు తన వ్యక్తిగతంగా కూడా సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ దేవాలయ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తన శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బడిగుంచల వెంకటేశ్వర్లు, దున్నా చెన్నయ్య చౌదరి, రామారావు, చందాల శివ, యామని రాంబాబు, గడిపూడి శ్రీకాంత్, గద్దె శ్రీకాంత్, నరసింహారావు, గడిపూడి సైదయ్య, పలు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో యరపతినేని సతీమణి ..

రానున్న సాధారణ ఎన్నికలలో గురజాల ఉమ్మడి పార్టీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును గెలిపించాలంటూ ఆయన సతీమణి నాగమణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొత్త గణేశునిపాడు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలు ఓటర్లకు అందజేస్తూ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు అఖండ మెజారిటీతో గెలిపించాలని నాగమణి కోరారు.

యరపతినేని సమక్షంలో టీడీపీలోకి చేరికలు

పిడుగురాళ్ల: దాచేపల్లి మండలం కేశానుపల్లి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొన్ని కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీ.వజ్రం, ఎం.ప్రశాంత్, సురేష్, పాపారావు, విజయ్, తదితరులు నెల్లూరి రామకోటయ్య ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు.



కొత్తగణేశునిపాడు ఎన్నికల ప్రచారంలో యరపతినేని సతీమణి నాగమణి



టీడీపీలో చేరిన వారితో యరపతినేని శ్రీనివాసరావు

ఉచిత ప్రయాణం ఎంతో ఉపయుక్తం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్లటౌన్, మే 4: కూటమి మేనిఫెస్టోలోని సూపర్ 6 పథకాల్లో భాగమైన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయుక్తమని టీడీపీ సీనియర్‌నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని 56, 59 పోలింగ్ బూత్‌ల పరిధిలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులైన లావు శ్రీకృష్ణదేవరాయలు, బ్రహ్మారెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో గాజుల చిన వీరాంజనేయులు, అచ్చా సాంబశివరావు, ఆకుల కోటేశ్వరరావు, శ్రీశైలం, కనకంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

● ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోవాలి..

సత్తెనపల్లి, మే 4 : ఎన్నికల్లో విధుల్లో పాల్గొనే వివిధ క్యాటగిరి ఉద్యోగులకు వారి ఓటు హక్కు వినియోగించు కోవటానికి సత్తెనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు నియోజక వర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ శనివారం తెలిపారు. వారికి కేటాయించిన తేదీల్లో కేంద్రానికి వచ్చి ఉదయం 9 గంటల నుంచి 5 గంటల లోపు ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. 5వ తేదీన పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్స్, 6న పోలీసులు, ఇతర ఉద్యోగులు, 7వ తేదీన ఇతర ప్రభుత్వ సర్వీసులకు సంబంధించిన ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించు కోవాలని ఆయన తెలిపారు.

గిరిజనులకు తీవ్ర అన్యాయం

విజయపురిసౌత్, మే 4: వైసీపీ పాలనలో గిరిజనకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ గిరిజన నేత కరెంటోత్ పాండునాయక్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి అణగదొక్కారని, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వంటి దుర్మార్గుడ్ని ఇంత వరకు చూడలేదన్నారు. అతన్ని దుర్మార్గాలను చూడలేక టీడీపీలో చేరామన్నారు. గిరిజనులమంతా టీడీపీకి పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతున్నామన్నారు. కూటమి అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలును అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో మల్లినాయక్, బొల్లా వెంకటేశ్వర్లు, ఆడెపు కోటయ్య, టీ.పరమేశ్వరరావు, రాంచంద్‌నాయక్, తార్యా నాయక్, అప్పలరాజు, కట్టా రాజు, ధనుంజయరావు, రత్తయ్యబాబు, మంగ్తా నాయక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత కోటేశ్వరరావుపై వేటు

మాచర్లటౌన్, మే 4: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుమ్మడి కోటేశ్వరరావును పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక వెంకట సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నియమావళికి వ్యతిరేకంగా మాచర్ల అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో పాటు నామినేషన్ ఉపసంహరించుకోవాలని పలుమార్లు సూచించినప్పటికీ నామినేషన్ వెనక్కు తీసుకోకపోవడంతో బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

సైకిల్ గుర్తుకు ఓటువేయండి..

పెదకూరపాడు, మే 4: సైకిల్‌గుర్తుకు ఓటు వేసి భాష్యం ప్రవీణ్, లావు శ్రీకృష్ణదేవరాయలను గెలిపించాలని భాష్యం ప్రవీణ్ కుమారుడు అఖిల్ శనివారం పెదకూరపాడులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాటిబండ్ల గ్రామంలోని వైసీపీకి చెందిన పలువురు టీడీపీ చేరగా వారికి జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌వరప్రసాదు, మాజీ ఎంపీపీ పాటిబండ్ల శివమ్మ, జనసేన నేతలు బాలస్వామిలు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే పెదకూరపాడు, పరస గ్రామానికి చెందిన వైసీపీ నేత అమరనేని కోటేశ్వరరావు తదితరులు టీడీపీలో చేరారు. బుచ్చయ్యపాలెం, బలుసుపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న భాష్యం ప్రవీణ్ తనయుడు అఖిల్

మాజీ సర్పంచ్ ఇరుకులపాటి అబ్బయ్య, బండి హనుమంతరావు, పాపయ్య నేతలు పలువురు ఎన్నికల ప్రరంలో పాల్గొన్నారు.



త్రిపురాపురంలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న కన్నా

చంద్రబాబు విజన్ రాష్ట్రానికి అవసరం

● సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, మే 4 : చంద్రబాబు విజన్ రాష్ట్రానికి అవసరమని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మండలంలోని త్రిపురాపురం, బాలాజీ నగర్ తండా, నరసింగపాడు, గుండ్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ఇంటింటికి తిరిగి మేనిఫెస్టోను వివరించారు. అనంతరం కన్నా మాట్లాడుతూ .. వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగి వేశారి పోయిన ప్రజలు మే 13న కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకొనేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజధాని నిర్మాణం, గోదావరి- పెన్నానదుల అనుసంధానం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. తొలుత కన్నా త్రిపురాపురంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, కాసా సాంబయ్య, కంటు శ్రీను, చిన్నెబోయిన శ్రీనివాసరావు, సేవ్లా నాయక్, మునీ నాయక్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో కన్నా లక్ష్మీనారాయణ

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వలంటీర్ ..

రాజుపాలెం :మండలంలోని కొండమోడు గ్రామానికి చెందిన వలంటీర్ గడిబోయిన లక్ష్మీ నియోజకవర్గ కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో వైసీపీ వీడి టీడీపీలో చేరారు. అదే విధంగా రెడ్డిగూడెం, ఆకుల గణపవరం గ్రామాలకు చెందిన పలువురు కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పల్లపాటి పెద్దిరాజు, నాయకులు వేపూరి రామయ్య, అంకాళ్ల ప్రభుదాసు, అంచుల నరసింహరావు, కోట జోసఫ్, బుర్రి రాంబాబు తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనలో కాపులకు అన్యాయం

అమరావతి, మే 4: గత ఎన్నికలలో వైసీపీకి మద్దతు తెలిపిన కాపులను అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అణిచివేచి తీరని అన్యాయం చేశాడని కూటమి కాపు నాయకులు ఆరోపించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తే వైసీపీ దానిని రద్దు చేసిందన్నారు. కాపులకు అన్యాయం చేసిన వైసీపీకి రానున్న ఎన్నికలలో కాపులందరూ తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి, భావితరాల భవిష్యత్‌కోసం కాపులందరూ కూటమికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ, జనసేన కాపునేతలు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ, మంగిశెట్టి శ్రీనివాసరావు, నిమ్మా వెంకటేశ్వరరావు, విన్నకోట సాంబశివరావు, ఏ వెంకటనారాయణ, రాయి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



భాగ్యనగర్ కాలనీలో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న రద్రమదేవి

సూపర్ 6 పథకాలతో ఎంతో మేలు

● ఎన్నికల ప్రచారంలో లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి రుద్రమదేవి

సత్తెనపల్లి రూరల్, మే 4 : సూపర్ - 6 పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి రుద్రమదేవి అన్నారు. మండలంలోని ధూళిపాళ్ళ పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో కూటమి సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారిత కూటమితోనే సాధ్య మవుతుందన్నారు. సూపర్ - 6 పథకాల్లో భాగంగా మహిళలకు ప్రవేశ పెట్టిన పథకాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరిస్తూ టీడీపీ మేనిఫెస్టో, సూపర్ 6 పథకాలను వివరించారు. ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

చేరికలకు ప్రలోభాల వల..

● ఇళ్ల స్థలాల ఆశచూపి కండువాలు కప్పుతున్న వైసీపీ నేతలు

దాచేపల్లి, మే 4: దాచేపల్లిలోని జిమ్మచెట్టు సెంటర్‌లో నివాసముంటున్న చక్రాల వీరయ్య టీడీపీ కార్యకర్తగా వున్నాడు. వీరయ్యను కొంతమంది వైసీపీ నేతలు పథకాల ఆశచూపి వైసీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పారు. సమాచారం అందుకున్న టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్, పగడాల భాస్కరరావు, బొమ్మిరెడ్డి సత్యం, సూరం చంద్రరావు, తదితరులు వీరయ్య ఇంటికి వెళ్లి జరిగిన విషయంపై వివరాలు సేకరించి మళ్లీ వీరయ్యకు టీడీపీ కండువా కప్పారు. ఈ విషయంపై టీడీపీ నేతలు మాట్లాడుతూ ప్రజల అమాయకత్వాన్ని వైసీపీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. పథకాలను ఆశచూపి మభ్యపెట్టి వైసీపీ కండువాలు కప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న పల్లపాటి పెద్దిరాజు, మర్రి వెంకట్రామిరెడ్డిలు

కన్నా, లావుల విజయం కోసం పాదయాత్ర

రాజుపాలెం,మే4: టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, సతైనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణలు విజయం సాధించాలని కోరుతూ రాజుపాలెంలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి దేవరంపాడు కొండపై వేంచేసియున్న శ్రీ నేతి వెంకన్న స్వామి ఆలయం వరకు శనివారం టీడీపీ నేతలు పాదయాత్ర చేపట్టారు. రాజుపాలెం గ్రామానికి చెందిన పొత్తూరి శ్రీనివాసమూర్తి, పులిబండ్ల సాంబశివరావు చొక్కా శ్రీను, వాసా వెంకటేశ్వర్లు, యమార్తి వెంకట్రామయ్య, బ్రహ్మయ్య, శ్రీను, మల్లేశ్వరరావు, వెంకటప్పయ్య, కుర్రా కోటయ్య, చొక్కా బుల్లి, సఖినాల లింగయ్య, వల్లంశెట్టి సీతయ్య, మొర్రిబోయిన గోపి, జంగాల సామేలు, జనసేన పార్టీ నేతలు జక్కరాము, చెవుల ఆంజనేయులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్రను మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేన పార్టీ అధ్యక్షుడు తోట నరసయ్యలు ప్రారంభించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి..

రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలించాలని కోరుతూ శనివారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాదిగలకు న్యాయం జరగాలంటే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు కనుమూరి కోటేశ్వరరావు, సంద్రపాటి నాగేశ్వరరావు, గంట ఏలిషా, గడ్డిపర్తి నోవాక్, వాసా మునలయ్య, సంద్రపాటి బాబు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

- బెదిరించి, భయపెట్టి మద్యాన్ని కాజేస్తున్న వైసీపీ నేతలు
- ఒక్కో షాపు నుంచి రోజుకు 20 కేసుల మద్యం డిమాండ్
- ఇస్తేనే ఉద్యోగాలు.. లేకుంటే కష్టమే
- ఇప్పటికే ఇంటి దారి పట్టిన పలువురు ఉద్యోగులు
- చూసీ చూడనట్లు వదిలేస్తున్న సెబ్ అధికారులు
- పట్టుకున్నా.. ప్రతిపక్షాల వారైతేనే కేసులు

మద్యంపై.. పెత్తనం



- గుంటూరు డిపో పరిధిలోని ఒక మద్యంషాపులో పనిచేస్తున్న సూపర్‌వైజర్ ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఏమిటా అని ఆరా తీయగా అధికారపార్టీ నేతల ఒత్తిడి భరించలేక అతడు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైననాటి నుంచి రోజుకు 15- 20 కేసుల మద్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో తాను ఇవ్వలేక, వారి బెదిరింపులు తట్టుకోలేక ఉద్యోగానికి రాజీనామా చేసేశాడు.
- పెదకూరపాడు నియోజకవర్గంలో ఇటీవల ఒక షాపు సూపర్‌వైజర్ మద్యం కేసులు తరలిస్తూ సెబ్ అధికారులకు దొరికిపోయాడు. అతడు అధికార పక్షానికి మద్యం సరఫరా చేస్తుండడంతో వారు చూసీ చూడనట్లు వదిలేశారు. పట్టపగలు రెడ్ హ్యాండెడ్‌గా దొరికి పోవడంతో కేసు పెట్టక తప్పని పరిస్థితి ఏర్పడడంతో ఆ ఉద్యోగికి బదులు వేరొకరిపై కేసు నమోదు చేశారు. దొరికిన సమయంలో లభించిన వాహనం స్థానే వేరొక డొక్కు వాహనాన్ని చూపించి స్వాధీనం చేసుకున్నారు.

- ఇవి ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగిన రెండు వేరువేరు ఘటనలు. మద్యం షాపులపై అధికారపార్టీనేత ఒత్తిళ్లు.. అధికార పార్టీకి సహకరిస్తున్న అధికారుల వైఖరికి ఈ రెండు ఘటనలు అద్దంపడుతున్నాయి.

గుంటూరు, మే 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మద్యానికి డిమాండ్ పెరుగుతోంది. ఆ డిమాండుకు సరిపడా మద్యాన్ని స్వాధీనం చేసుకునేందుకు దూకుడుగా వ్యవహరిస్తోంది. జిల్లాలో వున్న మద్యం షాపుల్లో లభించే మద్యాన్ని తమకే దక్కేలా ఉద్యోగులపై ఒత్తిడి చేస్తోంది. ఒక్కో షాపు నుంచి రోజుకు 15 నుంచి 20 కేసుల మద్యాన్ని తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. అలా ఇవ్వనివారిని అధికారపార్టీ నేతలు తీవ్రంగా బెదిరిస్తున్నారు... భయపెడుతున్నారు. అవసరమైతే ఉద్యోగులను అదుపులోకి తీసుకుని(కొన్ని చోట్ల కిడ్నాప్ చేసి) హెచ్చరిస్తున్నారు. దీంతో ఉద్యోగులు చేసేదేమీ లేక అధికారపార్టీకి సెరండర్ అయిపోయి మద్యం సరఫరా చేస్తున్నారు.

అధికంగా అమ్మరాదని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు

ఇదిలా వుండగా ఎన్నికల సమయంలో ఎక్కువ మద్యం అమ్మకూడదని ఎక్సైజ్ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. రోజువారీ అమ్మకాల కంటే అదనంగా 10 శాతానికి మించి అమ్మకాలు జరగకూడదని చెబుతున్నారు. అంతకు మించి అమ్మకాలు జరిగితే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎదుట హాజరై వివరణ ఇచ్చుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఒకరికి ఒక సీసాకు మించి మద్యం మాత్రమే ఇవ్వాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. అయితే ఈ ఆదేశాలన్నీ ప్రతిపక్షాలకు మద్యం సరఫరా విషయంలోనే అని తెలుస్తోంది. అధికారపక్షం విషయంలో ఎక్సైజ్ శాఖ, ఎస్ఈబీ అధికారులు చూసీ చూడనట్లే వ్యవహరిస్తున్నట్లు జరుగుతున్న ఘటనలు చెబుతున్నాయి. జిల్లాస్థాయిలో ఎక్సైజ్ అధికారులను తమకు అనుకూలంగా వుండేవారినే నియమించుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సలహాదారు, వైసీపీ కీలక నేతకు అత్యంత సమీప బంధువు ఒకరిని గుంటూరు జిల్లాలో మద్యం సరఫరాకు సంబంధించిన జిల్లా అధికారిగా నియమించడం ఆ వాదనకు బలం చేకూరుస్తోంది. అయితే అధికార పార్టీ మద్యం డిమాండు అత్యధికంగా వుంటోంది. ఏ చిన్న సభ, సమావేశం పెట్టినా ఒక్కో షాపు నుంచి 20 కేసుల మద్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆ డిమాండు ఎక్సైజ్ శాఖ జారీ చేసిన ఆదేశాలకంటే ఎక్కువగా ఉండడంతో ఉద్యోగులు మద్యం ఇవ్వలేక పోతున్నారు. అలా ఇవ్వలేని ఉద్యోగులపై వైసీపీ తీవ్రస్థాయిలో బెదిరింపులకు పాల్పడుతోంది.

ఇంటికి సరఫరా చేస్తే రూ.20 అదనం

ఎన్నికల సమయాన్ని ఆసరా చేసుకుని సెబ్ అధికారులు షాపు ఉద్యోగులను దండుకుంటున్నారు. ఒక్కో షాపు నుంచి నెలకు రూ.10వేలు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ అదనపు సొమ్మును సంపాదించేందుకు షాపు ఉద్యోగులు అడ్డదారి తొక్కాల్సి వస్తోంది. అధికారపార్టీ కోరిన విధంగా షాపు దగ్గరే మద్యం ఇస్తే.. సీసాకు రూ.10 అదనంగా ఇస్తారు. అదే మద్యం కేసులు నేరుగా వారు కోరిన చోటకి వెళ్లి డెలివరీ చేస్తే సీసాకు రూ.20 ఇస్తున్నారు. దీంతో చాలామంది షాపు ఉద్యోగులు వారే నేరుగా మద్యం సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదిలా వుండగా ప్రతిపక్ష పార్టీ నేతల నుంచి కూడా మద్యం డిమాండు విపరీతంగా పెరుగుతోంది. దీంతో కొంతమంది వారికి కూడా మద్యం సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా మద్యం సరఫరా చేస్తూ ఇటీవల కాలంలో అనేకమంది ఎస్ఈబీ అధికారుల కంటపడినా వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ప్రతిపక్షాలకు మద్యం సరఫరా చేస్తుంటే మాత్రం కేసులు పెడుతున్నారని, అధికార పక్షానికి సంబంధించినవారైతే కేసులు పెట్టకుండా వదిలేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో తాము ఏం చేయాలో తెలియక అనేకమంది ఉద్యోగాలకు గుడ్‌బై చెబుతున్నారు.

ఎన్నికల ప్రకటనలకు.. అనుమతి తప్పనిసరి



కలెక్టర్ శివ శంకర్ లోతేటి

నరసరావుపేట, మే4: పోలింగ్‌రోజు, పోలింగ్‌కు ముందు రోజు ప్రచురించే ఎన్నికల రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎంసీఎంసీ కమిటీ ముందస్తు అనుమతి లేకుండా పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు ప్రింట్ మీడియాలో ఎలాంటి రాజకీయ ప్రకటనలను ప్రచురించకూడదన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గతంలో పలు సందర్భాల్లో ప్రింట్ మీడియాలో అభ్యంతరకర, తప్పుదారి పట్టించే ప్రకటనలు ప్రచురితం అయ్యాయన్నారు. వీటివల్ల ప్రభావితమయ్యే అభ్యర్థులు, పార్టీలకు అటువంటి సందర్భాల్లో వివరణ, ఖండన అందించే సమయం కూడా ఉండనందున ఎన్నికల చివరి దశలో ఇటువంటి ప్రకటనలు మొత్తం ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నట్టు ఎలక్షన్ కమిషన్ గుర్తించిందన్నారు. అటువంటి ఉదంతాలు పునరావృతం కాకుండా ఎలక్షన్ కమిషన్ తనకున్న అధికారాలను ఉపయోగించుకుని తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా రాజకీయ ప్రకటనల్లోని విషయాలు రాష్ట్ర, జిల్లాస్థాయిలో ఎంసీఎంసీ కమిటీ వారి నుంచి ముందస్తుగా ధ్రువీకరించబడినట్లయితే తప్ప, ఏ రాజకీయ పార్టీ అభ్యర్థి లేదా మరే ఇతర సంస్థ, వ్యక్తి పోలింగ్ రోజున మరియు పోలింగ్‌కు ఒక రోజు ముందు ప్రింట్ మీడియాలో ఎలాంటి ప్రకటనను ప్రచురించకూడదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రకటనలకు సంబంధించి దరఖాస్తును ప్రచురణ రోజుకు కనీసం 3 రోజులు ముందుగా ఉంటుందన్నారు. వార్తాపత్రిక ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయడానికి, జిల్లాస్థాయిలో ఎంసీఎంసీ కమిటీలను అప్రమత్తం చేయటం జరిగిందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఇతర సంస్థల నుంచి అందిన అటువంటి ప్రకటనలను కమిటీలు త్వరితగతిన పరిశీలించి, ముందస్తుగా ధ్రువీకరిస్తాయని తెలిపారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వార్తాపత్రికలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రాజకీయ ప్రకటనల విషయంలో ఎలక్షన్ కమిషన్‌కు సహకరించాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్.. నేటి నుంచి

- నియోజక కేంద్రాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు
- 7 వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం పోలింగ్
- 19,095 మంది ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్‌లు జారీ

నరసరావుపేట, మే 4: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ఆదివారం ప్రారంభం కానుంది. ఇందుకోసం ఎన్నికల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. 7వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పోస్టల్ బ్యాలెట్‌ని వినియోగించుకొనేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 19,095 మంది ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్‌లు జారీ చేశారు. వీరిలో 16,582 మంది జిల్లాలో విధులు నిర్వహిస్తూ జిల్లాలోనే ఓటుహక్కు కలిగినవారు ఉన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తూ ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులు 2,513 మంది ఉన్నారు. సోమవారం పీవో, ఏపీవో, ఓపీవోలకు, 6న పోలీస్ సిబ్బందికి, 7న డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు, అత్యవసర సర్వీసుల్లో పనిచేసే 33 శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు సదుపాయం కల్పించారు. ఆయా తేదీల్లో ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటింగు సౌకర్యం కల్పించారు. ఇతర జిల్లాలో ఓటు ఉన్న ఉద్యోగులు 6వ తేదీన వారు ఎక్కడ పోస్టల్ బ్యాలెట్ పొందారో ఆ నియోజకవర్గం కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే విధం గా ఏర్పాట్లు చేశారు.

మాచర్లలో స్వల్ప మార్పులు..


మాచర్ల నియోజకవర్గంలో 6న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటిస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం శాంతి భద్రతల పరవేక్షణ విధులు నిర్వహించనున్నందున 6న పోలీస్ శాఖ కి సంబంధించి ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను 7వ తేదీకి నాటికి మార్చామని అని జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలో మాత్రమే ఈ మార్పు ఉందని మిగతా నియోజకవర్గాల్లో యధావిధిగా జరుగుతుందని సూచించారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల వివరాలు..

- 85- పెదకూరపాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల పెదకూరపాడు
- 96- చిలకలూరిపేట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గణపవరం
- 97- నరసరావుపేట: ఎస్ఎస్ఎన్ కళాశాల, నరసరావుపేట
- 98- సత్తెనపల్లి: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సత్తెనపల్లి
- 99- వినుకొండ: లయోలా స్కూల్, వినుకొండ
- 100- గురజాల: ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురజాల
- 101- మాచర్ల: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, రైల్వే గేట్ దగ్గర, మాచర్ల

పచ్చని పల్నాడు.. నా కల

- పల్నాడును సిరుల మాగాణిగా మారుస్తా
- వరికపూడిశెల పూర్తి చేసి 1.2 లక్షల ఎకరాలకు సాగునీరు
- గోదావరి జలాలు తీసుకురావడం ద్వారా 9 లక్షల ఎకరాల సాగు స్థిరీకరణ
- వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ తాగునీరు
- ప్రాజెక్టు పనులు మధ్యలో ఆగకుండా ఉండాలంటే నేను గెలిచి తీరాలి
- వరికపూడిశెల అనుమతులు కోసం కాళ్లకు బలపం కట్టుకొని తిరిగా
- పల్నాడు ప్రజల కళ్లలో ఆనందం చూడటం కోసం శ్రమిస్తా
- నా గెలుపు పల్నాడు ప్రజల గెలుపు
- నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు



గుంటూరు(ఆంధ్రజ్యోతి), మే 4: పల్నాడును రత్నాల సీమగా మార్చటమే నా లక్ష్యం. బీడు భూములకు సాగునీరు అందించి సిరుల మాగాణిగా మార్చాలన్నదే నా సంకల్పం. నేను అబద్ధాలు చెప్పలేను. బూతులు మాట్లాడలేను. కేవలం అభివృద్ధి మాత్రమే చెయ్యగలను. గడప గడపకు వెళ్లి ప్రజల అవసరాలు ఏమిటో తెలుసుకొని వాటిని పరిష్కరించగలను. దశాబ్దాలుగా పేపర్లు, వాగ్దానాలకు మాత్రమే పరిమితమైన వరికపూడిశెల పూర్తయితే పై పల్నాడులో చాలా వరకు బీడుగా ఉన్న భూమి సాగులోకి వస్తుంది. గోదావరి జలాలు ఎత్తిపోతల ద్వారా తీసుకు వస్తే 9 లక్షల ఎకరాల సాగు స్థిరీకరణ జరిగి పల్లవ నాటి సీమ సిరుల మాగాణి అవుతుంది. అదే నా కల.. అదే నా లక్ష్యం అని' నరసరావుపేట తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అంటున్నారు. ఎన్నికల ప్రచార వేళ ఆయన 'ఆంధ్రజ్యోతి' తో ప్రత్యేకంగా మాట్లాడారు. ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందని చెబుతున్న లావు శ్రీకృష్ణ దేవరాయలు ఏమన్నారో ..ఆయన మాటల్లోనే..

ప్రశ్న : ఐదేళ్ల నరసరావుపేట జర్నీ ఎలా ఉంది?

లావు: నరసరావుపేట అంటేనే ఉద్దండుల కోట అని పేరు. మాజీ ముఖ్యమంత్రులు అక్కడ నుంచి ఎంపీలుగా పనిచేశారు. అటువంటి రాజకీయ ప్రాధాన్యం ఉన్న చోట సీటు దక్కటం నా పూర్వజన్మ సుకృతమే. ఇక్కడి ప్రజలు చాలా చైతన్య వంతులు. వారు మన ప్రతి మాట, నడత పరిశీలిస్తారు. నన్ను అక్కున చేర్చుకున్నారు. మొదటి ప్రయత్నంలోనే నన్ను పార్లమెంటుకు పంపిన అక్కడి ప్రజల రుణం తీర్చుకోవాలని సంకల్పం తీసుకున్నా. ఎన్నో అననుకూల పరిస్థితిలు ఉన్నప్పటికీ నిధుల కోసం కేంద్రపై ఎంతో ఒత్తిడి తీసుకువచ్చా. పార్లమెంట్‌లో మాట్లాడటానికి అవకాశం వచ్చినప్పుడల్లా ఇక్కడి సమస్యల గురించి ప్రస్తావించా. ప్రధానమంత్రిని కలిసిన ప్రతిసారి నా నియోజకవర్గానికి నిధులు కేటాయించమని అడుగుతూ వచ్చా.

ప్రశ్న : ఐదేళ్ల కాలంలో ఎన్ని నిధులు తీసుకువచ్చారు?

లావు: ఒక పార్లమెంటు సభ్యుడుగా నరసరావుపేటకు ఎన్ని నిధులు తీసుకురావాలో అన్ని తీసుకువచ్చా. రూ.3 వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం, జలజీవన్ మిషన్ పనులు కోసం రూ.500 కోట్లు, పిడుగురాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.500 కోట్లు, వరికపూడిశెల నిర్మాణానికి రూ.340 కోట్లు, రూ.10.61 కోట్లతో నకరికల్లులో ఇండో-ఇజ్రాయెల్ ప్రాజెక్టు, మాచర్ల, రొంపిచర్లలో 2 కేంద్రీయ విద్యాలయాలు, రూ.120 కోట్లతో జేఎన్టీయూ నరసరావుపేట కళాశాలకు శాశ్వత భవనం, రూ.2 కోట్ల తో 86 గ్రామాల్లో 435 కిమీ మేర డొంకలు, పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణం, గ్రామాల్లో 88 వాటర్ ప్లాంట్ల నిర్మాణం, పాఠశాలలు అభివృద్ధి కోసం ఎంపీ లాడ్స్ నుంచి నిధుల కేటాయింపు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాము.ఈ నిధులన్నీ కేంద్ర నుండి తెచ్చినవే.

ప్రశ్న : వరికపూడిశెల అనుమతి కోసం తిరిగినప్పుడు ఎదురైన అనుభవాలు

లావు: చిన్నతనం నుండి నాకు పట్టుదల ఎక్కువ. ఒక పని ప్రారంభిస్తే అది పూర్తయ్యే వరకు విశ్రమించేవాడిని కాదు. వరికపూడిశెల అనుమతుల విషయంలో ఆ మొండితనమే ఎంతో ఉపయోగపడింది. ఆ ప్రాజెక్టుకు అనుమతులు తీసుకురావడానికి కేంద్రమంత్రి కార్యాలయం చుట్టూ కాలికి బలపం కట్టుకొని తిరిగాను. ఎన్నో రోజులు శ్రమిస్తే తప్ప అనుమతులు మంజూరు కాలేదు. నిధుల కేటాయింపుకు కూడా అంతే పోరాటం చేయాల్సి వచ్చింది. నన్ను గెలిపించిన పల్నాడు ప్రజల కలలో ఆనందం చూడటానికి అంత శ్రమ అనుభవించా.

ప్రశ్న : ప్రచారం పర్వం ఎదురౌతున్న అనుభవాలు

లావు: ప్రచారానికి వెళ్తున్నప్పుడు ప్రతి గ్రామంలోనూ అన్ని వర్గాలకు చెందిన ప్రజలు నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. వాళ్ళ ఇంటిలో ఒక బిడ్డలా భావిస్తున్నారు. మహిళలు గ్రామస్తులు పూలు, హారతులతో స్వాగతం పలుకుతున్నారు. వారి ఆదరాభిమానాలు చూస్తూ ఉంటే ఎంత సేవ చేసినా తక్కువే అనిపిస్తుంది. యువకులు, రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ప్రశ్న : గ్రామాల్లో మీరు ప్రత్యేకంగా గమనించిన పరిస్థితులు ఏమిటి

లావు: ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. నేను గ్రామాలకు వెళ్ళినప్పుడు యువత ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ఆవేదన కలుగుతుంది. ఎవరిని కదిలించినా పెద్ద పెద్ద చదువులు చదువుకున్నామని చెబుతున్నారు. కానీ అర్హతకు తగిన ఉద్యోగం, ఉపాధి అవకాశాలు దక్కటం లేదు. గడచిన ఐదేళ్ళ కాలంలో ఒక్క పరిశ్రమ రాష్ట్రానికి రాలేదు. ఉద్యోగాల కోసం వృద్ధులైన తల్లిదండ్రులను వదిలిపెట్టి సుదూర ప్రాంతానికి వెళ్ల వలసి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. గడచిన ఐదేళ్ళ పాలన వల్ల ఒక తరం బాగా నష్టపోయిందని చెబుతుంటే గుండె తరుక్కు పోతుంది.

ప్రశ్న : టీడీపీ మ్యానిఫెస్టో పై...

లావు: రానున్న ఐదేళ్ళలో రాష్ట్ర దశ, దిశ మార్చే విధంగా టీడీపీ మ్యానిఫెస్టో ఉంది. ముఖ్యంగా మహిళలు, యువకులు, రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. అమరావతి కల సాకారం అయితే యువతకు మంచి ఉద్యోగాలు మన రాష్ట్రంలో నే వస్తాయి. అనేక పరిశ్రమలు ఇక్కడకు వలస రావటం వల్ల రాష్ట్రం నుంచి వలసలు వెళ్లే పరిస్థితి తప్పుతుంది.

ప్రశ్న : పార్టీ వీడిన తర్వాత అటువైపు నుంచి మీ మీద వచ్చిన విమర్శలకు సమాధానం

లావు: నేను ఎటువంటి వాడినో వైసీపీలో ఉన్న నేతలు అందరికీ తెలుసు. ఏదో మాట్లాడాలని చేసే విమర్శలకు కాలమే సమాధానం చెబుతుంది. విమర్శకు ప్రతి విమర్శ సమాధానం కాదన్నది నా అభిప్రాయం. నేను ధర్మ మార్గాన్ని ఎంచుకున్నాను ఆ మార్గమే నన్ను రక్షిస్తుంది. వ్యక్తిగత విమర్శలకు చేసే స్థాయికి వేనాడు నేను దిగజారి పోను. నా వ్యక్తిత్వం నచ్చిన వైసీపీ నాయకులు కార్యకర్తలు ఈనాటికి నాకు మద్దతుగానే ఉన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత విమర్శలు చేసినవారు బాధపడాల్సిన సందర్భం వస్తుంది.

ప్రశ్న : రానున్న ఐదేళ్ళలో మీరు ఇచ్చే హామీ

లావు: నేను ఒకే విషయాన్ని నరసరావుపేట పార్లమెంటు ప్రజలకు చెప్పాలనుకుంటున్నాను. ఎంతో కష్టపడి వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు నిధులు తీసుకువచ్చాను. ఆ పనులు ముందుకు సాగి సకాలంలో పూర్తి కావాలంటే నాలాంటివారు ప్రతినిత్యం దాని వెంట పడుతూ ఉండాలి. రూ.500 కోట్లతో పిడుగురాళ్ల సమీపంలో నిర్మించబడుతున్న మెడికల్ కాలేజీ పరిస్థితి కూడా అదే. నకరికల్లు సమీపంలో తలపెట్టిన ఇండో- ఇజ్రాయిల్ ప్రాజెక్టు, కేంద్రీయ విద్యాలయాల నిర్మాణాలు, లాజిస్టిక్ హబ్ ఏర్పాటు, పీఎం శ్రీ యోజన పథకం ద్వారా ప్రతి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు జరగాలంటే నా గెలుపు ఎంతో ఆవశ్యకం. పల్నాడు ప్రాంత ప్రజలు నన్ను గెలిపించి వారు గెలుస్తారని నేను బలంగా నమ్ముతున్నా.

ఓటేసిన శతాధిక వృద్ధురాలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న 104 ఏళ్ల వృద్ధురాలు ఇందిరాదేవి

పొన్నూరుటౌన్, మే4: హోం ఓటింగ్‌లో భాగంగా శనివారం శతాధిక వృద్ధురాలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం, చింతలపూడి గ్రామానికి చెందిన 104 ఏళ్ల ధూళిపాళ్ళ ఇందిరాదేవి శనివారం హోం ఓటింగ్‌లో భాగంగా ఓటు వేశారు. గతేడాది పొన్నూరు నుంచి బాపట్ల వైపు వెళుతున్న టీడీపీ అధినేత చంద్రబాబును చూసేందుకు ఇందిరాదేవి కుటుంబ సభ్యుల సహకారంతో వీల్‌చైర్ పై వచ్చి రహదారి పక్కనే వేచివున్నారు. ఆ సమయంలో చంద్రబాబు కాన్వాయి ఆపించి వృద్ధురాలి వద్దకు రావటమే కాకుండా ఆరోగ్యం గురించి వాకబు చేశారు. స్వయంగా ఆమె ఆశీస్సులు అందుకున్నారు. రానున్న ఎన్నికలో ఓటు వేసే వరకు జీవించే ఉంటానని ఇందిరాదేవి చంద్రబాబుకు చెప్పారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో 104 ఏళ్ల ఇందిరాదేవి ఓటు హక్కు వినియోగించుకొని చంద్రబాబుకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని ఆనందం వ్యక్తం చేశారు.

పొన్నూరుకు నేడు పవన్‌కల్యాణ్

- యుద్ధ ప్రాతిపదికన హెలిప్యాడ్ నిర్మాణం
- జనసేనాని పర్యటనను అడ్డుకునే కుట్రపై ఆగ్రహం, ఫిర్యాదు

పొన్నూరు టౌన్, మే 4: పవన్‌కల్యాణ్ పొన్నూరు పర్యటనను అడ్డుకునే కుట్రలను చేధిస్తూ కూటమి నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. స్థానిక సజ్జా ఫంక్షన్ హాల్ ఎదురుగా పవన్‌కల్యాణ్ దిగేందుకు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను శుక్రవారం అర్ధరాత్రి వైసీపీకి చెందిన వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారు. దీనిపై శనివారం ఉదయం జనసేన, టీడీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. ఈ క్రమంలో ఆదివారం పవన్ పర్యటనకు ఆటంకం కలగకుండా శరవేగంగా హెలిప్యాడ్‌ను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించారు. హెలిప్యాడ్‌ను వైసీపీ నాయకులు ధ్వంసం చేసినా టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో వేగవంతంగా పనులు చేపట్టారు. పవన్ పర్యటనకు అతికొద్ది సమయం ఉన్నప్పటికీ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నరేంద్ర తెలిపారు. ఏర్పాట్లను జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

పవన్ పర్యటన సాగేదిలా..

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉదయం 10 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో సజ్జా ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రారంభమయ్యే రోడ్ షో ఐలాండ్ సెంటర్ వరకు చేరుకుంటుంది. ఆచార్య ఎన్జీరంగా విగ్రహ కూడలిలో బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తారు. పవన్ పర్యటన విజయవంతానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేశారు.

హెలిప్యాడ్ ధ్వంసంపై ఈసీకి ఫిర్యాదు

పవన్ పొన్నూరు పర్యటనను అడ్డుకునేలా హెలిప్యాడ్ ధ్వంసంపై టీడీపీ నేతలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముకేష్‌కుమార్‌మీనాకు శనివారం ఫిర్యాదు చేశారు. వైసీపీ అభ్యర్థి అంబటి మురళి సూచనల మేరకు ఆయన అనుచరులు హెలిప్యాడ్‌ను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. హెలిప్యాడ్ ధ్వంసానికి పిడుగురాళ్లకు చెందిన వల్లెల శివశంకర్‌రెడ్డికి చెందిన ఎక్స్‌కవేటర్, ఓ లారీని ఉపయోగించారని తెలిపారు. వాటికి అనుమతులు కాని, లైసెన్స్ కానీ లేవన్నారు. రాజకీయ కుట్రకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఈవోను టీడీపీ పొన్నూరు పరిశీలకులు మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, బండారు వంశీ కృష్ణ తదితరులు కోరారు.



సీఈవో ముకేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నాయకులు



పవన్ పర్యటన గురించి నరేంద్రకుమార్‌తో చర్చిస్తున్న గాదె వెంకటేశ్వరరావు తదితరులు

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పోలింగ్ నిర్వహణలో ఉదాసీనత తగదు

● కలెక్టర్ శివ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్

నరసరావుపేట, మే 4 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణపలో సిబ్బంది ఉదాసీనత తగదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. స్థానిక నరసరావుపేటలోని భువన చంద్ర టౌన్ హాల్లో నరసరావుపేట నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఉన్న కొన్ని సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం, సాయుధ బలగాలను కూడా నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ స్టేషన్లలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు ముందస్తుగా ఎవరికి తెలపాలి అనే విషయమై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవీఎంలలో సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత సెక్టోరల్ ఆఫీసర్లకు తెలియజేయాలని అదేవిధంగా లా అండ్ ఆర్డర్ విషయమై ఉదసీనతను వదిలి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలీసు సిబ్బందికి, అడిషనల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రెస్పాన్స్ టీంలు ఉంటాయని వారికి తెలియజేవిధంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికలు నిర్వహించాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు భయభ్రాంతులను చేయడం వారిని తీసుకొనిపోవడం వంటి కార్యక్రమాలు జరిగినప్పుడు పోలింగ్ సిబ్బంది అప్రమత్త వ్యవహరించి తదనగుణంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి శ్రీమతి సరోజ, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు

దళిత మహిళపై వైసీపీ వర్గీయుల దాడి

● ఎన్నికల ప్రచారంలో వీరంగం

● కాలనీవాసులకు మాజీ వలంటీర్ బెదిరింపులు

వయ్యకల్లు (శావల్యాపురం) మే 4: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల ప్రచారం చేస్తుండగా రోడ్డుపై మంచం వేసుకొని పడుకొని ఉన్న ఎస్సీ కాలనీకి చెందిన దళిత మహిళపై వైసీపీ వర్గీయులు దాడికి దిగారు. ఈ ఘటన శావల్యాపురం మండలంలోని వయ్యకల్లు ఎస్సీకాలనీలో శనివారం రాత్రి జరిగింది. బొల్లా బ్రహ్మనాయుడు గుంటుపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా గుంటుపాలెంకి ఆనుకొనియున్న వయ్యకల్లు ఎస్సీ కాలనీలో వైసీపీ వర్గీయులు ఆటోలో తిరుగుతూ ఎస్సీకాలనీలో ప్రచారానికి సిద్ధం చేస్తున్నారు. రోడ్డుపై మంచంపై పడుకొని ఉన్న మహిళపై వైసీపీ వర్గీయులు కంకరరాళ్ళు విసిరారు. దీనిపై ఆ మహిళ, మరో మహిళ దారా అంజమ్మ వారిని నిలదీసింది. దాంతో రెచ్చిపోయిన అదే కాలనీకి చెందిన మాజీ వలంటీర్ కవలకుంట మరియబాబు, దారా జీవప్రసాద్, దారా నిషక్ అంజమ్మతో వాగ్వివాదానికి దిగారు. ఆమెను దుర్భాషలాడుతూ చెంపపై కొట్టి దాడికి పాల్పడ్డారు. అంతలో కొందరు ఎస్సీ కాలనీవాసులు అక్కడికి చేరుకొని దౌర్జన్యంపై ప్రశ్నించగా వారితో కూడా వాగ్వివాదానికి దిగి దాడికి యత్నించారు. దీంతో ఎస్సీకాలనీలో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకొంది. స్థానికుల సమాచారంతో ఎస్ఐ చల్లా సురేష్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు. కాలనీవాసులు ఎక్కువమంది టీడీపీకి అనుకూలంగా ఉన్నారన్న అక్కసుతోనే వైసీపీ వర్గీయులు వారిని బెదిరించేందుకు ఇలా దాడికి పాల్పడ్డారని కాలనీవాసులు ఆరోపించారు. గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహించి ఇటీవల రాజీనామా చేసిన మరియబాబు గతంలో కూడా పలుమార్లు కాలనీవాసులపై బెదిరింపులకు పాల్పడ్డాడని, ఇష్టానుసారంగా వ్యవహరించాడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

మరోసారి వైసీపీ వస్తే వలసలే

● యాదవుల ఆత్మీయ సమావేశంలో లావు, ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 4: రాష్ట్రంలో మరోసారి వైసీపీ వస్తే బలహీనవర్గాలకు చెందిన వారు జీవనం కోసం వలస పోవాల్సిందేనని నరసరావుపేట లోక్‌సభ కూటమి అభ్యర్థి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. తొలుత సభలో ఎమ్మెల్సీ, బీసీ సీనియర్ నాయకుడు జంగా కృష్ణమూర్తి వైసీపీలో తనకు ఎదురైన అనుభవాలు, ఆ పార్టీని వీడి టీడీపీలోకి ఎందుకు రావాల్సి వచ్చిందో వివరించారు. అనంతరం లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో తమ ప్రవర్తన, వ్యక్తిత్వాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న తీరును చూసి ఓటేయాలని కోరారు. పార్లమెంట్‌లో మన ప్రాంత సమస్యలపై గళమెత్తారా లేదా అని బేరీజు వేసుకోవాలన్నారు. ప్రత్తిపాటికి, లావుకి ఓటు వేస్తే ఈ ప్రాంతానికి ఉపయోగం ఉంటుందా లేదా అనేది గమనించాలని సూచించారు. డెయిరీ పరిశ్రమల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ఓట్లువేసి గెలిపించిన ప్రజలను మోసం చేసిన చరిత్ర మంత్రి రజినీదన్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలు చూసిన తర్వాత జగన్‌రెడ్డి పార్టీ గ్రాఫ్ రోజురోజుకీ పడిపోతుంటే కూటమి గ్రాఫ్ రోజురోజుకీ పెరిగిపోతుందన్నారు. అభివృద్ధి కోరుకునే వారు, రాజధాని అమరావతి కావాలని కోరుకునే వారు చంద్రబాబు, పవన్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. మూడోసారి మోదీ ప్రధాని కాబోతున్నారని, ఇది బీసీలు గర్వపడే విషయమన్నారు. వైసీపీపై చేస్తున్న ధర్మ పోరాటంలో యాదవులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



రొంపిచర్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ అమూల్య

రొంపిచర్ల, గోగులపాడులో అమూల్య, ప్రణీత ప్రచారం

రొంపిచర్ల, మే 4 : మండలంలోని రొంపిచర్ల, గోగులపాడు గ్రామాల్లో అసెంబ్లీ కూటమి అభ్యర్థి చదలవాడ అరవింద బాబు కుమార్తె డాక్టర్ అమూల్య, కోడలు ప్రణీత శనివారం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా లావు శ్రీ కృష్ణ దేవరాయలు, అరవింద బాబులను గెలిపించాలన్నారు. నియోజకవర్గంతో పాటు పార్లమెంట్, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమాల్లో పులకూరి జగ్గయ్య, వైద్యులు భారతి, హిమజ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కోడెల స్టేడియంలో డాక్టర్ ఆదిత్యా, రూపేష్‌గుప్తా మాటామంతి

నరసరావుపేట టౌన్, మే 4: పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శనివారం ఉదయం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తనయుడు డాక్టర్ ఆదిత్య, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా తనయుడు నాగసరపు రూపేష్‌గుప్తా పర్యటించారు. మార్నింగ్ వాక్ వచ్చిన పట్టణవాసులతో మాటామంతీ నిర్వహించారు. స్టేడియంలో వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామని హామీఇచ్చారు,

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

పెదనందిపాడు, మే 4: పెదనందిపాడు- పొన్నూరు రహదారిలో పుసులూరు గ్రామ సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు పల్నాడు జిల్లా శావల్యాపురానికి చెందిన లక్ష్మణ్ భార్య దీవెనలు ద్విచక్ర వాహనంపై గుంటూరు జిల్లా గోవాడకు శుభకార్యానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అదుపుతప్పి కింద పడ్డారు. లక్ష్మణ్ తలకు బలమైన గాయం కాగా, భార్య దీవెనకు కాలుకు గాయమవడంతో స్థానికులు 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మణ్ మృతి చెందాడు. ఎస్ఐ టి. రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే యువతకు ఉద్యోగావకాశాలు

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు



ఎన్నారైల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిపాటి పుల్లారావు

చిలకలూరిపేట మే 4: మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే నైపుణ్యాభివృద్ధితో పాటు కొత్త కోర్సుల ద్వారా రాష్ట్ర యువతకు తిరిగి దేశ, విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ప్రతినిధులతో ప్రత్తిపాటి సమావేశం నిర్వహించారు. ఎన్నారై టీడీపీ విభాగం అధ్యక్షుడు వేమూరి రవి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్ రైజ్ ఏపీ క్యాంపెయిన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఆర్ఐలు తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా వారు చిలకలూరిపేటకు విచ్చేసి ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపాటి మాట్లాడుతూ ప్రస్తుతం యువత అంతా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారంతా ఒక్క వారం రోజులు కష్టపడితే తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

ముఖ్యమంత్రి జగన్ గడిచిన అయిదేళ్లలో యువత భవితను పూర్తిగా అంధకారం చేశారన్నారు. గ్రాడ్యుయేషన్లు పూర్తిచేసుకున్న విద్యార్థులకు బయట రాష్ట్రాల్లో, బయట దేశాల్లో ఎలాంటి అవకాశాలు ఉన్నాయో సరైన మార్గనిర్దేశం అందించడం చాలా అవసరం అన్నారు. రవి వేమూరితో కలసి గతంలో 50, 60మందికి ఆ దిశగా నైపుణ్యాభివృద్ధి సర్టిఫికెట్లు కూడా అందించామన్నారు. కొంతమందికి విదేశాల్లో ఉద్యోగాలు కూడా కల్పించామని తెలిపారు. ఆ దిశగా ఇప్పుడు చిలుకలూరిపేటలో ప్రత్యేకసెల్ ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగాలిప్పిస్తామని వచ్చినందుకు ఎన్నారైలకు పేరుపేరున అభినందనలు తెలియచేస్తున్నామన్నారు. ఎన్నారై టీడీపీ ద్వారా కల్పించాలని అనుకుంటున్న లక్ష ఉద్యోగాల్లో చిలకలూరిపేట యువత ఎక్కువమంది ఉండాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

లక్ష మందికి ఉద్యోగాల కల్పన: రవి వేమూరి

ఎన్నారై టీడీపీ విభాగం అధ్యక్షుడు రవి వేమూరి మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎన్నారై విభాగం ద్వారా లక్ష మందికి ఉద్యోగాలు కల్పించాలని సంకల్పం తీసుకున్నామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచి యూరప్, అమెరికా, గల్ఫ్ సహా వివిధ దేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధి, జగన్ పాలనలో జరిగిన నష్టంపై యువతలో చైతన్యం తీసుకొస్తామన్నారు. గతంతో పోల్చుకుంటే ఈసారి టీడీపీ తరపున ప్రచారం చేయడానికి పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్రులు వచ్చారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాల్ని చూడలేకే వేల డాలర్ల సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని ఇక్కడకు వచ్చి ప్రచారం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎన్నారై సభ్యులు తెలిపారు.

రాష్ట్రమంతటా వైసీపీ వ్యతిరేకత

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



సమన్వయ కమిటీ సమావేశంలో ప్రకటిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, కొట్టా కిరణ్ కుమార్, కుమ్మెత కోటిరెడ్డి తదితరులు

నరసరావుపేట టౌన్, మే 4: రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళినా వైసీపీకి వ్యతిరేకత స్పష్టంగా కన్పిస్తోందని, ప్రజలు విజ్ఞతతో కూటమికి అధికారం కట్టబెట్టడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాల యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లా డుతూ సంక్షేమం పేరుతో సంపద సృష్టించకుండా బటన్ నొక్కుతున్నానని చెతు న్నాడని అన్నారు. పట్టిన బిడ్డ నుంచి మరణించే వరకు కావాల్సిన సంక్షేమాలు ఏర్పాటు చేసింది చంద్రబాబునాయుడేనని, పేదవాడిని ధనవంతుడు చేయాలనే ఆలోచిస్తున్న వ్యక్తి చంద్రబాబునాయుడే అన్నారు. పల్నాడు జిల్లాలో ఎన్నికలు సజావుగా జరగడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ ఏర్పాటు

నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీని ఏర్పాటు చేశామని కొమ్మాలపాటి చెప్పారు. టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్, డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వ రరావు, సీనియర్ నాయకులు అట్లా చిన వెంకటరెడ్డి, వేములపల్లి వెంకట నరసయ్య, డాక్టర్ మర్రి పెద్దయ్య, రావెల సత్యనారాయణ, రాష్ట్ర బులియన్ మర్చంట్ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ కుమార్, బీజేపీ నియో జకవర్గ రంగిశెట్టి రామకృష్ణ, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీలను ఎన్నిక ల కూటమి సమన్వయ కమిటీ నియామకం చేశారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ కుమార్, గొట్టిపాటి జనార్దన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో మండలంలో జీవీ ఆంజనేయులు ప్రచారం



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, మే 4: మండలంలోని చక్రాయపాలెం, హనుమాపురం, రావులాపురం, గంగుపల్లి తండా, మన్నెపల్లి తండా, గుంట్లపల్లి, కండ్రిక గ్రామాల్లో శనివారం మాజీ ఎమ్మెల్యే మక్కెనతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ తాత, ముత్తాతల నుంచి వచ్చిన ఆస్తులపైన జగన్ ఫొటోలు ఎందుకు?, ఇకనైనా వైసీపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం బొల్లాపల్లి మండలంలోని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో హనుమాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనం ఆస్తులపై జగన్‌రెడ్డి ఫొటో ఏమిటని ప్రశ్నించారు. ఉంటే ప్రభుత్వ ముద్ర ఉండాలని, చివరికి పొలం గట్లపై, సర్వే రాళ్ళపై జగన్ ఫొటోలు వేసుకోవటంపై సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. ఫొటోలు ఉంటే బ్యాంకుల్లో రుణాలు ఇవ్వబోమని బ్యాంకులు చెపుతున్నాయన్నారు. అత్యంత ప్రమాదకరమైన ల్యాండ్ టైటిలింగ్ తెచ్చారని మండిపడ్డారు. జీవీకి గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. మహిళల హారతులు, సుగాలీ నృత్యాలతో మండలంలో జీవీకి బ్రహ్మరథం పట్టా రు. కార్యక్రమంలో పార్టీ నేతలు గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమానాయక్, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, ఆరికట్ల వాసుదేవరెడ్డి, యర్రంశెట్టి జయరావు, ఎలిశెట్టి నరసింహారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

35 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలంలోని గుమ్మనంపాడు, మూగచింతలపాలెం గ్రామాల నుంచి 35 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ లో చేరారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు బొల్లాపల్లి మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మనంపాడు గ్రామం నుంచి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో అయ్యన్నపాలెం సైదా, ముక్కు కృష్ణారెడ్డి, ఏసుబాబు, కుమార్‌నాయక్, బాబునాయక్, శివానాయక్, సురేష్‌నాయక్, ఏసుదాసు, వెంకటేశ్వర్లుతో పాటు 30 కుటుంబాలు, అదేవిధంగా మూగచింతలపాలెం గ్రామం తెనాలి ఎస్సీకాలనీ నుంచి పార్టీలో చేరిన వారికి జీవీ ఆంజనేయులు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం వస్తేనే యువతకు ఉపాధి, పేదవారికి సంక్షేమం సాధ్యమన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

● ఎస్టీల ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాటి పుల్లారావు



ఎస్టీల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 4: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అయిదేళ్లుగా రద్దుచేసిన గిరిజనుల సంక్షేమ పథకాలన్నీ తిరిగి పునరుద్ధరిస్తామని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. చిలకలూరిపేట పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్ లోని మెడికల్ హాల్‌లో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఎస్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్టీలందరికీ 2 సెంట్ల స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని గిరిజనులకు ఎవరి హయాంలో మేలు జరిగిందో బేరీజు వేసుకుని ఎన్నికలలో ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. దశల వారీగా మద్యపాన నిషేధం చేస్తానని 2019 ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక అందరినీ మోసం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను నాసిరకం మద్యానికి, గంజాయికి జగన్ కేంద్రంగా మార్చారని, మద్యం ఆదాయాన్ని కూడా తాకట్టుపెట్టి రూ.11వేల కోట్లు అప్పుచేసిన వ్యక్తిని ఏమనాలని ఆయన ప్రశ్నించారు. అసలు జగన్ వలన బాగుపడిన వారు ఈ రాష్ట్రంలో ఎవరైనా ఉన్నారా అని ఆయన ప్రశ్నించారు. అదే సమయంలో జగన్ అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. టీడీపీ హయాంలో పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా పాడుబెట్టారని వాపోయారు. తమ ప్రభుత్వం రాగానే వాటిని పేదలకు అందిస్తామన్నారు. పేదలను ఆదుకునేందుకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకం తీసుకురాబోతున్నామని తెలిపారు. ప్రజల గురించి ఆలోచించే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రభుత్వంలో ఉంటే పేదలకు మరింత మేలు జరుగుతుందన్నారు. అమూల్యమైన ఓట్లను ఒకటి తనకు, మరొకటి లావు శ్రీకృష్ణదేవరాయలుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

6, 7 డివిజన్లలో ప్రత్తిపాటి సతీమణి, కుమార్తె ప్రచారం

చిలకలూరిపేట, చిలకలూరిపేట అర్బన్, మే 4: రాష్ట్రంలో నాసిరకం మద్యానికి బలైపోయిన వారిలో ఒక్కరి ప్రాణాన్నైనా తిరిగి తేగలరా అని ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి ప్రభుత్వాన్ని శనివారం ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చింది మొదలు వారి మద్యం కారణంగా 30 వేలమందికి పైగా బలైపోయినా కనీస బాధ్యత లేనట్లు వ్యవహరిస్తూ ఉండడం దారుణం అన్నారు. పట్టణంలోని 6, 7, వార్డులలో ప్రత్తిపాటి పుల్లారావుకు మద్దతుగా ఆయన సతీమణి వెంకటకుమారి, కుమార్తె స్వాతి ఇంటింట ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. వారిద్దరికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకటకుమారి మాట్లాడుతూ రాక్షస పాలన పోవాలంటే ఈ ఎన్నికల్లో కూటమిని గెలిపించుకుని తీరాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.



ప్రచారంలో పాల్గొన్న ప్రతిపాటి వెంకట కుమారి

పార్టీ కార్యాలయం ప్రారంభం

చిలకలూరిపేట అర్బన్, మే 4: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని 19 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలకు ప్రతి ఒక్కరికి నెల నెల అందించ బోయే రూ.1500 ఆర్థికసాయంతో మొత్తం ఐదు సంవత్సరాల్లో వారికి రూ.90వేలు అందనుందని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని 34, 35 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాలను కుమార్తె స్వాతితో కలసి ఆమె ప్రారంభించారు.

ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 4: చిలకలూరిపేట మండలం బొప్పూడిలో 41వ తిరునాళ్ళ సందర్భంగా శనివారం ప్రసన్నాంజనేయస్వామి వారిని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు చేసి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో టీడీపీ అభ్యర్థి లావు సోదరి ప్రచారం

చిలకలూరిపేట, మే 4: పట్టణంలోని 11వ వార్డు పరిధిలో ఉన్న మానుకొండవారిపాలెంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు సోదరి రుద్రమదేవి శనివారం గడప గడపకు తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి శ్రీ కృష్ణ దేవరాయలను, ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావును ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో 11వ వార్డుకు చెందిన నాయకులు కల్లి వీరారెడ్డి, కార్యదర్శి బెజ్జం రవి తదితరులు పాల్గొన్నారు.

లింగారావుపాలెం, మైదవోలు గ్రామాలలో శరత్ ప్రచారం

యడ్లపాడు, మే 4: గత ఐదేళ్ళుగా రాష్ట్రంలో సైకో పాలన సాగుతోందని, దానికి చరమగీతం పాడాలని ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు ప్రత్తిపాటి శరత్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి మండలంలోని లింగారావుపాలెం, మైదవోలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. చిలకలూరిపేట తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ గెలుపు ఆవశ్యకత, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్థులకు అభివాదం చేస్తున్న జంగా కృష్ణమూర్తి, డాక్టర్ లావు మేఘన

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు

● ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నాదెండ్ల, మే 4: టీడీపీతోనే బీసీలకు గుర్తింపు అని ఎమ్మెల్సీ, నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ ఎన్నికల కో-ఆర్డినేటర్ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ఇర్లపాడు, నాదెండ్ల గ్రామాల్లో ఆయా గ్రామాలకు చెందిన యాదవులతో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో జంగా కృష్ణమూర్తితో పాటు ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలు సతీమణి డాక్టర్ లావు మేఘనలు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభల్లో జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ తాను శ్రీకృష్ణదేవరాయలు మొన్నటి వరకు వైసీపీలోనే ఉన్నామన్నారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నా తన స్వగ్రామంలో కార్యక్రమాలకు కనీసం ప్రొటోకాల్ పాటించకుండా అవమానాలకు గురిచేశారన్నారు. ఆత్మాభిమానంతోనే మళ్ళీ టీడీపీలో చేరానన్నారు. అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడాలంటే టీడీపీకి ఓట్లువేసి శ్రీకృష్ణ దేవరాయలను, పుల్లారావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ లావు మేఘన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు ఎంపీగా పల్నాడులో కేంద్రీయ విద్యాసంస్థలు, వరికపుడిసెల పథకం నిర్మాణానికి అనుమతులతో పాటు పలు సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషిచేశారన్నారు. ఆయన చేసిన అభివృద్ధి, వ్యక్తిత్వాన్ని దృష్టిలో పెట్టుకొని మళ్ళీ గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు బండారుపల్లి సత్యనారాయణ, ఎస్.హరిబాబు, జి. సుబ్బారావు, నాగేశ్వరరావు, హనుమంతరావు, సాంబయ్య, అంకమరావు, పూర్ణయ్య, జనసేన నేత బీ శరత్, వివిధ గ్రామాలకు చెందిన యాదవ వర్గీయులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన

జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలి

జనం పార్టీ అధ్యక్షుడు కంభం ఆనంద్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనం పార్టీ అధ్యక్షుడు కంభం ఆనంద్‌కుమార్

వినుకొండ, మే 4: దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును నెత్తిన మోస్తూ దళితుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలని జనం పార్టీ అధ్యక్షుడు కంభం ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ రాజ్య స్థాపన కోసం తెలుగుదేశం, జనసేన కూటమికి జనం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ఓటమి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థుల గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలను గ్రామ స్థాయిల్లోకి తీసుకుపోతున్నట్లు తెలిపారు. 2019 నుంచి నేటివరకు బహుజనులు ఆంధ్ర రాష్ట్రంలో పనిలేక, తిండి దొరక్క ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ముద్దులు పెట్టి ముఖ్యమంత్రిగా ఆధిష్ఠానం ఎక్కారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ రుణాలు రద్దు చేశారని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆనాడు రాజ్యాంగంలో రచించిన విధంగానే సంక్షేమ పథకాలు అందాల్సి ఉందన్నారు. సైకో జగన్ వాటిని రద్దు చేశారన్నారు. అంబేద్కర్ పేరుతో విదేశీ విద్యను సైతం రద్దు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యువతను ఆర్థికంగా అభివృద్ధి చేయాల్సిందిపోయి 10వేలు, 5వేలు ఇస్తూ బిచ్చగాళ్లుగా చేశారని అన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ చట్టం బలోపేతంగా ఉండేదని జగన్మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత చట్టం నిర్వీర్యం చేశారన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలనకు వ్యతిరేకంగా కె.లక్ష్మి ఢిల్లీ నడిబొడ్డున తన బొటన వేలును కోసుకున్నారని, ఆమె వైద్యశాలలో ప్రమాదకర స్థితిలోఉందన్నారు. మరలా సంక్షేమ రాజ్యం రావాలని కోరుతూ ప్రచార కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. వినుకొండలో జీవీ ఆంజనేయులును భారీ మెజార్టీతో గెలిపించాలని త్వరలో వందలమందితో జనం పార్టీ ఆధ్వర్యంలో టీడీపీ చేరుతున్నట్లు ఆయన తెలిపారు. సైకో ముఖ్యమంత్రి అరాచకాలు ఇక సాగవని, దళితులు తలుచుకుంటే ఓడించే వరకు నిద్రించరన్నారు. ఆయనతోపాటు పిల్లి రాంబాబు, బండి అమర్, రత్నరాజులుతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి అండగా ఉంటాం: వడ్డెర సంఘం నేతలు

చిలకలూరిపేట, మే 4: రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావటానికి తామంతా అండగా ఉంటామని రాష్ట్ర వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డె వెంకట్ శనివారం అన్నారు. ఆయన పట్టణంలో టీడీపీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ప్రత్తిపాటి పుల్లారావును కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. బీసీల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. తమ కులస్తులందరూ టీడీపీకి అండగా ఉండి ప్రభుత్వ ఏర్పాటులో తోడ్పడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంక్షేమం సంఘం అధ్యక్షుడు పి. శివయ్య, శరత్‌బాబు, జి.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం

చిలకలూరిపేట, మే 4: పట్టణంలోని మోడరన్ కాంప్లెక్స్‌లో ఉన్న వాసవి గ్రాండ్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు చిలకలూరిపేట నియోజకవర్గ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని పల్నాడు జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెలంపల్లి రవిశంకర్, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గుర్రం సాంబశివరావు శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, అసెంబ్లీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు హాజరవుతారని వివరించారు. సమావేశానికి ఆర్యవైశ్యులందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

శాస్త్రీయ ఆలోచనపై అవగాహన

యడ్లపాడు, మే 4: శాస్త్ర ప్రగతే దేశ ప్రగతి అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యడ్లపాడు గ్రామాభ్యుదయ కమిటీ విద్యావిభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు నాలుగవ రోజైన శనివారం శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన శాస్త్రీయ ఆలోచనల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. భావవాదం, భౌతికవాదంల గురించి వివరిస్తూ భావవాదానికి మూలం ఆలోచన అని, భౌతికవాదానికి మూలం పదార్థమని ఉదాహరణలతో వివరించారు. ప్రతిఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని, ప్రతి విషయాన్ని ప్రశ్నించాలన్నారు. పరిశోధనల ద్వారా వచ్చిన ప్రతిఫలాలను సమాజం మొత్తానికి ఉపయోగించడమే సైన్స్ ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్యచౌదరి, సభ్యులు ముత్తవరపు రవీంద్రబాబు, పీఆర్ విజ్ఞానకేంద్రం సభ్యులు నూతలపాటి కాళిదాసు, నారాయణ ఇంగ్లీషుమీడియం స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో దివిస్ ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట టౌన్, మే 4: స్థానిక పెట్లూరివారిపాలెంలో ఉన్న ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో శనివారం దివిస్ ఫార్మా కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ప్రాంగణ ఎంపికలకు 70మంది విద్యార్థులు హాజరుకాగా 43మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కంపెనీ ప్రతినిధులు డాక్టర్ అశోక్, మురళీకృష్ణ తెలియజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ్ భూషణ్‌రావు, దివిస్ లేబరేటరీస్ ప్రాంగణ నియామకాల ప్రతినిధులు హరికృష్ణ, రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ ఎం లక్ష్మీ సురేఖ, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.